# రంగుల గది

చినిగిపోయిన ఆకాశం సాయంత్రపు వీధుల్నిండా చెల్లాచెదురుగా పడుంది. వెలుగు నీడల ముక్కల్ని తొక్కుకుంటూ నలభైఅయిదేళ్ళుగా తెలిసున్న అపరిచిత ప్రపంచాన్ని అలవోకగా తాకుతూ తప్పించుకుంటూ నడుస్తున్నాను.

నాకు తెలుసు ఇంకాసేపటికి ఈ వెలుగు మిగుల్ని కూడా చీకటి నాకేస్తుంది. నా బతుకులో నిస్తేజాన్నీ, నిర్వీర్యాన్నీ, హైన్యాన్నీ మింగేసే ప్రచండమైన వెలుగేదేనా వస్తే బావుణ్ణు. నా చుట్టూ ఉన్న మొత్తం ప్రపంచాన్ని తగలేసినా అంత వెలుగూ, వేడి పుట్టదు. నాకు తెలుసు.

పెదవుల మీద చిరునవ్వు మొలిచింది.

స్టేజీ మీదే కాదు.

మొహానికి రంగేసినప్పుడే కాదు.

ఏదో పాత్రని అవాహన చేసుకున్నప్పుడే కాదు.

ఒక నిర్వేదాన్ని పెనవేసుకుని ప్రతి చీకటి నొప్పికీ, ఆకటి చిచ్చుకీ, ఆవేదన కాటుకీ, దారిద్ర్యపు చేటుకీ - అన్నిటికీ అన్నిటికీ ఈలవాటైపోయిన చిరునవ్వు!

ట్రౌజర్ జేబులో చేయిపెట్టి మూలలు చిరిగిపోయిన పర్స్ తీశా.

ఇంకా ఇరవై ఒకటో తారీఖే. జీతంరాళ్ళు రాటానికింకా పదిరోజులుంది. పర్స్‌లో మూడు పది కాయితాలూ, ఓ చినిగిన అయిదు నోటూ, రెండు రెళ్ళూ ఉన్నాయి. చిల్లర సంచీలో కొన్ని నాణేలున్నాయి. పర్లేదు, పర్లేదు. రాత్రి రంగును మార్చేయొచ్చు.

"నమస్కారం బాబూ."

నిన్న పెన్షన్ కోసం కాయితాలు పెట్టుకున్నావిడ పేరు గుర్తు రావట్టే... ఛా ... ఫ్యామిలీ పెన్షన్.... భర్త సర్వీస్‌లో ఉండగానే పోయాడు. కంపాషనేట్‌గ్రౌండ్స్ కింద అతని కూతురికి ఉజ్జోగం! భార్యకి పెన్షను. ఆఁ... ఆఁ... రూతమ్మ. పేరు గుర్తొచ్చింది. లేట్ గిద్దలూరు ఏసోబు భార్య.

"నమస్తే రూతమ్మగారూ. నిన్ననే గదా, కాగితాలన్నీ సబ్మిట్ చేశారు. అవుతుంది, పనౌతుంది చెప్పాను గదా. మీ తరఫున ఎవరేనా మగాళ్ళుంటే పంపించండి. అన్నీ మీతో మాట్లాడలేం కదా. అయినా, ప్రతిదానికీ మరెక్కడ తిరుగ్గల్రు చెప్పండి. ఆడవాళ్ళైతిరి."

అయిదారు వేలైనా దక్కకపోతాయా అన్న ధీమా మనసులో. అవినీతి నా మొహమ్మీద మొలిచే చిరునవ్వంత మామూలైపోయింది.

నా బతుకులో ఆఖరికి అయిదుకూ పదికీ కూడా చేయి చాచే హైన్యం అలవాటుగా మారిపోయింది.

ఎప్పుడో నా జీవిత చరిత్ర మొదట్లో గిల్ట్ అనబడే భావం ఒకటుండేదేమో. లీలగా గుర్తు.

అప్పుడు ఆదిమ మానవుణ్ణి.

ఇప్పుడు సభ్య సామాజికుణ్ణి మరి.

నాగరికత బలిసిన వాడిని.

"కొంచెం త్వరగా అయ్యేట్టు చూడండి. బాబూ. ఆ డబ్బూ అదీ చేతికొచ్చి పాపకు ఉజ్జోగం వస్తే రెండు పూట్లా మీ పేరు చెప్పుకుని అన్నం తింటాం."

నేనో దేవుడినన్నట్లు నన్ను అతి గౌరవంగా చూసి దండం పెట్టి, ఆ దైన్య భారద్దేశం నా ముందునించీ కదలిపోయింది.

చేతిలో ఉన్న పర్స్‌లోకి మరోమాటు తొంగిచూసి దీర్ఘంగా నిట్టూర్చి జేబిలోకి పంపించేశా పర్స్‌ని. చేతిని అట్లాగే జేబులో ఉంచుకుని పర్స్‌నిజేబీ చీకట్లో పట్టుకుని నడుస్తున్నా.

మోపెడ్ మీద లెనిన్ ఎదురొచ్చాడు.

"సాయంకాలం వచ్చెయ్. ఒంగోల్లో పోటీ ఉందట. కొత్త నాటకం పట్టుకొచ్చాడు సూర్యారావు. వీలైతే భోయనం చేసొచ్చెయ్."

లెనిన్‌తో పాటు అతను రాసుకున్న వట్టివేరు పరిమళం కూడా నన్నొదిలిపోయింది.

లెనిన్ నిజంగా వ్లాదిమిర్ యూల్యనోవ్ ఇల్యిచ్ లాగానే అనిపిస్తాడు. నాలాంటి దగుల్బాజీలకి అర్థంకాని, అర్థం అసలు తెలుసుకోలేని పవిత్రతని కప్పుకుని తిరుగుతుంటాడు.

నాలాంటి అధర్మ పాపులకి అతనో పవిత్రమైన బైబిల్, ఓ భగవద్గీత, ఓ జెందవెస్తా, ఓ ఖుర్ ఆన్, ఓ గ్రంథసాహిబ్. తాకాలంటే భయమేసేట్టు!

ఏ నాటకం తెచ్చాడో సూర్యారావు?

కళ కోసం నిజంగా జీవితాన్ని ఫణంగా పెట్టే వాళ్ళుంటారంటే సూర్యారావుని చూడకముందు నమ్మేవాణ్ణి కాదు. సూర్యారావుకు వేరే వ్యాపకాలేమీ లేవు. బ్రహ్మచారి. బియ్యేతోపాటు ప్రపంచాన్ని చదివేశాడు. నాటకరంగం పట్ల ఏవిధంగా ఆకర్షితుడ

య్యాడో తెలీదు గానీ, మనసునే రంగస్థలం చేసుకున్నాడు. తాను ముఖానికి రంగేసుకోడు. అతనెప్పుడూ తెరవెనుకే. చిన్న చిన్న మార్పులతో స్టేజీ మీద ఎంత నవ్యతను చూపొచ్చో అతన్ని చూసి నేర్చుకోవాల్సిందే.

నాటక రంగంలో అతనెంత కలిసిపోయాడో తెలుసుకోడానికి అతని గదిలో పుస్తకాల షెల్ఫ్ నిదర్శనం.

"మరాఠీ, బెంగాలీ థియేటర్ ముందు తెలుగురంగం ఎక్కడుందో చూడండి. అవన్నీ పరిగెడుతున్న దశలో ఉంటే మనమింకా మోకాళ్ళ మీద దేకుతున్నాం" అంటాడు.

ఎప్పుడో పందొమ్మిది వందలా ఇరవైల్లో పుట్టిన ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ స్టేజీ నటులకెంత అవకాశమిచ్చిందీ, గాంధర్వ నాటక మండలిలో వచ్చేసిన గోవిందరావు టెంచే, మరాఠీలో తొలి ఆపెరా మహాశ్వేత గురించీ, 'లోకాషాహిర్ రామ్‌జోషి' నాయకుడు జైరామ్ షిలేదార్ సినిమాలు వదులుకుని నాటక రంగానికి ఎలా అంకితమైందీ అతను చెపుతుంటే నిజంగా కళ ముందు కాసు తుచ్ఛంగా కనిపిస్తుంది. కానీ, మాలాంటి వెధవలకి అది క్షణికమే. మళ్ళీ మా లోకాల్లోకి వచ్చేసిం తర్వాత మా మా సహజాతాల్లోకి మేము బానిసలైపోతాం.

కానీ, ఒక్క సంగతి నిజం. మిగిలిన సభ్యుల మాటెలా ఉన్నా నాకు మాత్రం ఓ నాటకమాడుతున్నామంటే రోజువారీ దౌర్భాగ్యాల్నించీ తాత్కాలికంగా తప్పించుకోవడమే. నాటకం సాకుతో దాదాపు ఇంటి బయటే కాలం గడుపుతుంటాను. నా ఇల్లంటే - నా ఇల్లాలు నా ప్రియమైన కావేరి అంటే రోత పుట్టి కాదు. నా ఏకైక సంతానం పద్మప్రియ మీద కోపం కాదు. నా బలానికి ఏమాత్రం లొంగని దారిద్ర్యం మీద నా కసి. దాని ఎదురుగా నేను మరుగుజ్జులా మారిపోతాను. దాని విశ్వరూపం చూస్తూ తట్టుకోలేను... అందుకే పారిపోతాను.

ఇంట్లోకి అడుగు పెడుతూనే రోజూ ఎదురయ్యేదే. వరండాలో పదిమంది అమ్మాయిల్ని కూచోబెట్టుకుని ప్రియ పాఠాలు చెప్తోంది. నాకు తెలిసీ నా కూతురనబడే పద్మప్రియ తన ఊహ తెలిసినప్పట్నించీ తనకంటూ ఓ ప్రత్యేకతని నిలుపుకుంటూ వస్తోంది. పదవ తరగతిలోంచే ట్యూషన్స్ చెప్పేది. నాతో దాదాపు మాట్లాడదు. వాళ్ళమ్మంటే విపరీతమైన ప్రేమ. ఇంటి మొత్తం దారిద్ర్యానికి నేనొక్కడినే కారణమన్న భావన దాని కళ్ళలో దిగంబరంగా కనబడుతుంది. ఆఖరికి తన అస్తిత్వానికి కారణమైన వ్యక్తిలా కూడా చూడదు నన్ను. అసలు నా అస్తిత్వమే ఇంటికో శాపంలా భావిస్తుంది.

దీర్ఘంగా నిట్టూర్చి చెప్పులుమూలకు వదిలి లోపలికెళ్ళా. లోపల అలికిడిలేదు. కావేరెక్కడికెళ్ళిందొచ్చూ? వంటగదిలోకి తొంగిచూశా. ఊఁహూఁ, పెరట్లో కూడా లేదు. బట్టలు మార్చి మొహం కడుక్కుందికి వెళ్ళా.

సాయంకాలం ఇంటికి రాగానే కాఫీ అనబడే ద్రావకం లోపలికెళ్ళకపోతే నా ప్రపంచంలో ఓ ముక్క చీలి రాలిపడిపోయినట్టనిపిస్తుంది. నోరు తెరిచి ప్రియని

కాఫీ ఇవ్వు అని అడగలేను. అదివ్వదు. మొహం తుడుచుకుంటూ వరండా మెట్లవరకూ వచ్చా. ట్యూషన్ పిల్లల్లో నలుగురైదుగురు తలల్తిప్పి చూసి మళ్ళీ పుస్తకాల్లోకి మొహాలు దాచేసుకున్నారు. ప్రియ కళ్ళెత్తి నన్నో చూపు చూసి పిల్లల వేపు తల తిప్పుకుంది. ఆ ఒక్క క్షణంలో 'ఎందుకొచ్చి నిల్చున్నావిక్కడ. నాకు చీదరగాఉంది' అన్న భావం ద్యోతకమైంది.

లోపలికొచ్చేశా. వంట గదిలోకెళ్ళి స్టౌ వెలిగించా. నీళ్ళు మరుగుతోంటే కావేరొచ్చింది. గబగబా నీళ్ళు దించి, కాఫీ పొడి వేసి మూత పెట్టి, "శ్రీనివాసరావు గారమ్మాయి... ఏడో తరగతిది... అప్పుడే ప్చ్" అంది తాను ఇంట్లో లేకపోవడానికి సంజాయిషీలా కాకుండా, వార్తలానూ కాకుండా. ప్రపంచంలోని స్త్రైణం మీది జాలితో మాట్లాడినట్లు అసలు స్త్రీత్వంతోనే మాట్లాడుతున్నట్లు అంది కావేరి.

"అయినా, ఈ ముండకేం మాయరోగమో. లేచొచ్చి కాఫీ కలిపివ్వచ్చుగా. దాన్నొక్క మాటననివ్వరు మీరు. మధ్యలో రెణ్ణిమిషాలు లేచొస్తే పాఠాలు వల్లకాటి కెళ్తాయా. తలపొగరు కాకపోతే" కూతురి మీద కోపం కంటే, నా మీద జాలే ఎక్కువ ధ్వనించిందామాట్లో.

"ఈవాళ కొత్తేమిటే నాకు. అది మనిద్దరికీ పుట్టిందన్న మటే గానీ, అది పూర్తిగా నీ బిడ్డే. సర్టిఫికెట్లలో రాసుకుందికే నా పేరూ, నేనూ." నిర్వేదంతో అని, మడత కుర్చీలో నేనూ మడతలు పడిపోయి కూర్చున్నా.

ట్యూషను పిల్లలు వెళ్ళిపోతున్న సందడి. పొద్దున ఓ బ్యాచి, సాయంత్రమో బ్యాచీ. రెండు దఫాలుగా లెక్కలూ, సైన్సు చెబుతుంది ప్రియ. తాను బియస్సీ ఫైనలియర్ చదువుతోంది. నెలకు ఎనిమిదొందలలో, వెయ్యో సంపాదిస్తుంది. నన్ను నయాపైసా అడగదు. నన్ను చూస్తే ఎందుకంత కోపమో, దానికి పెద్దగా ఆలోచించి చెప్పాల్సిన అవసరం లేదు.

నేనెంత తాలూకాఫీసు గుమాస్తాగాడినైనా నేనూ, భార్యా, ఒక్క కూతురూ సలక్షణంగా బతగ్గలిగిన సంపాదనే. ఇల్లూ సొంతమే. అద్దె కొంపేం కాదు. నా నిర్లక్ష్యం, నా బలహీనతలు, బాధ్యతను విస్మరించే గుణం - ఇవన్నీ కలిసి దారిద్ర్యాన్ని నా పక్కనే నిలబెట్టాయి. ఈ ఇంట్లో లేమికి పూర్తి కారణం నేనే అన్న సత్యం నాకు తెలుసు. నా బిడ్డకూ తెలుసు. వయసొచ్చి ఇంగిత జ్ఞానమున్న ఏ యువతికైనా బాధ్యతారాహితంగా మసలే తండ్రిని చూస్తే ప్రేమ చస్తే పొంగుకు రాదు. కోపమే వస్తుంది. చాలాచోట్ల అసహ్యం కూడా పెరుగుతూ ఉంటుంది. అన్నిటికీ మించి నేను నాటకాలేయడం దాని కసలిష్టం లేదు. రిహార్సల్స్ పేరుతో రాత్రి రెండుకీ మూడుకీ కొంపచేరడం, అదీ తాగి రావడం, ఉదయాన ఎనిమిదింటి వరకూ లేవకపోవడం - అసలు నే చేసే పనుల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా పద్మప్రియకిష్టం లేదు." ఒకే ఒక విషయంలో బహుశా నన్ను లోపల్లోపల మెచ్చుకుంటూంటుందేమో. నేనేనాడూ నోరెత్తి కావేరిని గానీ, ప్రియను గానీ తిట్టిన సంఘటన లేకపోవడం

మూలాన.

కావేరికి నా మీద ప్రేముందో లేదో చెప్పలేను గానీ, ద్వేషం మాత్రం లేశమాత్రం లేదు. పెళ్ళయిన కొత్తలోనే నేను నా బలహీనతలన్నిటినీ చెప్పేయడం, పెళ్ళైన ఏడాదికే ప్రియ కడుపులో పడ్డం, కాన్పు కష్టమై ఇకముందు గర్భం ధరిస్తే ప్రమాదమని డాక్టర్లు చెప్పడంతో నేనాపరేషన్ చేయించుకోవడం ఏమో. ఇవన్నీ కాకుండాకావేరీలో స్వతస్సిద్ధంగా ఉన్న మంచితనమూ నన్ను ఈ నన్నుగానైనా నిలబెట్టాయేమో ననిపిస్తుంది. కావేరి కాక ఇంకే స్త్రీయైనా నా జీవితంలోకి ప్రవేశించుంటే నా జీవితమెలా ఉండేదో ఊహించను కూడా లేను.

కాఫీ తాగడమైంది. గూట్లో సిగరెట్ పెట్టె తెచ్చిచ్చింది కావేరి నేనడక్కుండానే. లోపలికొచ్చి పుస్తకాలు సర్దుతున్న ప్రియ, "ఆహాఁ మహా పతివ్రత కావేరీ మహాదేవిగారూ. ఆ పెట్టెలోంచి ఓ కాష్టం తీసి మీ పతిదేవుల పెదాల మధ్యనుంచి వెలిగించి ఇంకో పిడికెడు పుణ్యం కట్టుకోండి. ఛీ, సిగ్గులేకపోతే సరి. ఇంట్లో మిగిలినవాళ్ళకు లేదులే నీకేమైందీ." ఆవేశంగా అంది.

ఇంట్లో ఇక మిగిలినవాళ్ళెవరో ఇక్కడందరికీ తెలుసు. "సిగ్గు లేకపోవడ మనేది' అక్కడ నాకు మాత్రమే వర్తిస్తుందన్న సత్యం అక్కడున్న మా ముగ్గురికీ తెలిసిపోయింది.

కావేరి ఆవేశంతో ఏదో అనబోయింది. చూపుల్తోనే వారించా.

ప్రపంచంలోని జుగుప్సని మోస్తూ నా కన్న కూతురక్కణ్ణుంచి నిష్క్రమించింది.

చిరునవ్వు కాయితం పూవు మళ్ళీ పూసింది.

సభ్య సమాజంలో బాధ్యతగల తండ్రిగా, భర్తగానే వ్యవహరించట్లేదు. అలాంటి నామీద నా కూతురూ, భార్యా కోపగించుకోకపోతే ఆశ్చర్యపడాలి.

వ్యక్తిగా ఓ సోమరి జీవితానికి బానిసైపోయిన జీవితం నాది. ఆ సోమరితనపు సుఖం నుంచి దూరం కావడానికి శరీరమూ, మనసూ రెండు మొరాయిస్తాయి. పెళ్ళయిన కొత్తలో సహజాతాల్ని అవతలికి నెట్టడానికీ ప్రయత్నించి, శుభ్రమైన ఆరోగ్యవంతమైన చైతన్యజీవితం పెట్టే ఉక్కిరి బిక్కిరికి తట్టుకోలేకపోయా. తట్టుకోలేక నా సోమరితనపు డేరాలో దూరిపోయా. ఆ డేరాలోంచి అప్పుడప్పుడూ తొంగిచూడ్డమే గానీ మొత్తానికి బయట పడ్డది లేదు.

నన్ను నేను నలభై అయిదేళ్ళుగా అద్దంలో చూసుకుంటున్నా. నన్ను నేనింకా గుర్తించలేదు. నేను ఈ నలభై అయిదేళ్ళూ బతికున్నానా, జీవించానా అన్న విచికిత్స అప్పుడప్పుడూ కలుగుతుంటుంది.

కానీ, నాకు తెలుసు. నా లోపల నాకు తెలీని ఇంకో నేనున్నాను. ఆ 'నేను' మొహానికి రంగేసుకున్నప్పుడు బయటికి వస్తాను. ఉతికి పిండి ఆరేసిన ఒక పురాతన చైతన్యాన్ని కప్పుకున్న ఆ నన్ను నేను గుర్తిస్తాను.

సూర్యారావే కాదు, ఎవరు తయారుచేసిందైనా సరే, ఎవరు రాసింయినా

సరే ఓ పాత్రని నాకు ఇస్తే నేను కరిగిపోయి ఆ వ్యక్తిత్వంలోకి, ఆ పాత్రలోకి ప్రవహించేస్తాను.

నాకు తెలుసు. నటన కూడా నా సహజాతమే. నాకే తెలీని ఓ ప్రిమిటివ్ ఇన్‌స్టింక్ట్ అది.

లెనిన్ బజార్లో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. సూర్యారావు తెచ్చిన కొత్త నాటకం గురించి 'ఏ నాటకం తెచ్చాడో సూర్యారావు' అనుకుంటూ బయటపడ్డా.

✦✦✦

చీకటి పడింది.

ప్రపంచంలో ఓ పార్శ్వానికి మెలకువ!

రోగమూ, పాపమూ ఒళ్ళు విరుచుకుంటూ నిద్ర లేస్తాయిక.

వీధి దీపాలు దాదాపుగా వెలగట్లేదు. అటూ ఇటూ తీవ్రమైన తొందరున్నట్టు జనాలు హడావిడిగా వెళుతున్నారు.

సైకిల్ రిపేరీ షాపును తప్పించుకుని వెళ్ళాలి నేను. ఉదయాన ఆఫీసుకెళ్తూ నానా బీభత్సంగా చప్పుడు చేస్తూ ఆగిపోయిన సైకిల్ని అక్కడ వదిలేసి వెళ్ళా. ఆ సైకిల్ కుర్రాడు రిపేరీ చేసుంటాడు. నేను కనబడ్తే నిలబెట్టి సైకిలిచ్చేస్తాడు. అంతే జేబులో ఉన్న ఆ నలభయ్యీ నాకు విడాకులిచ్చేస్తుంది. అమ్మో!

షాపు ముందు నుంచి గబగబా మొహమటు తిప్పకు తప్పుకున్నా. 'హమ్మయ్య' అనుకుని ఊపిరి పీల్చుకునేంత లోపల వాడు పక్కనే నిల్చుని ఉన్నాడు. సైకిల్ దిగి, "మజ్జాన్నంకెల్లే అయి పాయసా... క్రాంక్‌ల బాల్సులు పలిగినయ్... గంతే."

ఓ వంకర నవ్వు నవ్వి,సైకిల్ హ్యాండిల్మీద చెయ్యివేసి, గుండె నిబ్బరం చేసుకుని అనేశా... "నీ చార్జీ రేపిస్తానయ్యా ఎంతైందీ?"

"పద్మూఁద్రూపాయల్సా... వచ్చా" అని నా మర్యాద నిలబెట్టి వెళ్ళిపోయాడా కుర్రాడు.

ఏదో తెలీని భారం భుజాల మీదకెక్కిన అనుభూతి, ఓ క్షణం. మరుక్షణం జేబులోని నలభైకీ ఏ ఢోకా రానందుకు ఆనందం.

సైకిలెక్కబోతూంటే రోడ్డుకటువేపు సిగరెట్ బంకు దగ్గర్నించీ సుదర్శనం చప్పట్లు కొట్టి పిలిచాడు.

రోడ్డు క్రాస్చేయాలంటే డివైడర్ మీదుగా సైకిల్ మోసుకెళ్ళాలి. "మీరే ఇట్రండి." గట్టిగా అరిచా. జనాల్ని తప్పించుకుంటూ వచ్చాడు సుదర్శనం. సుదర్శనంవి గేలం చూపులు. వాటిల్ని తప్పించుకున్న చేపలు నాక్తెలీ్స లేవనే చెప్పాలి. నేనెంత! అయినా సుదర్శనం, నేను ఒకే గూటి పక్షులం. నన్ను గేలానికి తగలీ్సడు. మరెందుకు పిల్చాడో!

"ఆ సూరిగాడి దగ్గరకేనా?" రావడం రావడం వచ్చిగా అడిగాడు.

అవునన్నట్లు తలూపా.

సుదర్శనాన్ని ఒరుసుకుని సారా వాసన గుప్పుమంది.

"ఆ లచ్మీ కొడుక్కి లంపటాతెంపటా లేవు. వాడి నాటకాలు మరీ మితిమీరు తున్నాయి. మొన్న లలిత కళా పరిషత్‌లో ఆడిన ఆటకు సుశీలకింకా డబ్బు రాలే. అడిగితే నీకివ్వను. నీపెండ్లానికిస్తా ఫో అంటాడా ఆ నా కొడుకు? మొహాలకి రంగేసు కుని రంగమెక్కినంత మాత్రాన మా పెండ్లాలూ నాకొడుక్కి లంజెలు కారు. చెప్పు. ముందాట డబ్బులొస్తేనే ఈ నాటకం వప్పుకుంటుంది."

బాగా కాకున్నా సుమారుగా తాగున్నాడు. కదిలిస్తే ఇంకా పచ్చిబూతులు మాట్లాడ్తాడు. సుదర్శనం సుదర్శనంగా కాక, సుశీలనబడే ఓ కుళ్ళిపోయిన కట్టెమీద బతుకుతున్న శిలీంధ్రం.

సరేనన్నట్లు తలాడించి, "వెళ్తా" అని సైకిలెక్కబోయా. సైకిల్ క్యారియర్ పట్టుకుని నిలబెట్టాడు. ఏమిటన్నట్లు చూశా.

"లక్ష్మణ్ నాయక్ నుగాలిమెట్టనించీ ఇప్పుడే ఫ్రెష్గా రెండు క్యాన్లు తెచ్చినాడు. రసూల్గాని వర్క్‌షాపు వెనక... వస్తావా?" గురిచూసి కొట్టాడు.

నాలుక చిమచిమలాడింది. పర్సులో నలభైరూపాయలు నలభై రకాలుగా నన్ను నిలదీస్తున్నాయి.

"వస్తా. సూర్యారావుని కలిసి వచ్చేస్తా. మీరెళ్ళండి. ఇంకో అరగంటలో అక్కడుంటా" అన్నాను గానీ సైకిల్ పెడల్ మీదకి కాలువెళ్లలే.

"అర్ధగంటా? ఇంకో పావుగంటలో అంతా ఫైసల్. రెండు క్యాన్లే వచ్చినాయి" ఊరించాడు.

ఎలాగో మనసు దిటవు చేసుకున్నా.

"లెదులెండి. లెనిన్ కూడా ఎదురు చూస్తుంటాడు వెళ్ళి మాట్లాడి వచ్చేయడమే" అని సైకిలెక్కా.

మళ్ళీ సైకిల్ హ్యాండిల్ పట్టుకుని ఆపాడు. కాలు కింద పెట్టి దిగకుండా ఏమిటన్నట్లు చూశా మళ్ళీ.

"ఒక్క పదుంటే ఇయ్యి రేపిస్తా." ఉన్నా ఇవ్వనన్న సత్య స్పృహ అతని కంట్లో కనబడుతోంది.

"రేపిస్తా" అన్న పచ్చి అబద్దాన్ని అలవోకగా ఊసాడన్న నగ్నసత్యం మా ఇద్దరికీ తెలుసు. పిచ్చి ఆశల పచ్చికొర్కెల దోబూచీ దొంగాట అది.

"ఇప్పుడు లేవు. సూర్యారావునడిగి తీసుకోవాలి నేను కూడా. వస్తానన్నా కదా. ఓ అరగంటలో రసూల్ వర్క్‌షాపు దగ్గర ఉండండి" అని కదిలా.

ఏదో బూతుమాట గొణిగాడు.

నా అబద్ధాన్ని ఆనందిస్తూ నేను కమలానగర్ వేపు కదిలా.

సూర్యారావు మా ప్రభాత నాట్యమండలి కోసం అద్దెకు తీసుకున్న గది బయట లెనిన్ మోపెడ్ కనిపించింది.

'ప్రభాత నాట్యమండలేమిటండీ. మన్లో ఒక్కళ్ళకీ నాట్యమాడ్డం రాదు. నటనా మండలి అని పెట్టుకుందా'మని అందరం పోరాడాం మొదట్లో. సూర్యారావు ఒప్పుకోలేదు. 'ఈ రోజు నాటకాలెయ్యొచ్చు. భవిష్యత్తులో డాన్స్ ప్రోగ్రామివ్వమని గ్యారంటీ ఏమిటి' అని. నిజంగా భానుప్రకాశ్ అనే అతన్ని తీసుకొచ్చి క్లాసులు కూడా నడుపుతున్నాడు. వచ్చే ఎనిమిది పది మంది పిల్లలూ శుభ్రంగా ఫీజివ్వరు. ఇప్పుడు నిజానికి భానుప్రకాశ్ సూర్యారావుకి భారమయ్యాడనే చెప్పాలి.

ఏదేమైనా, మా కంపెనీకి ప్రభాత నాట్యమండలి అన్న పేరే స్థిరమైపోయింది.

గదిలో కరెంటు లేదు. నిజానికి ఊళ్ళోనే లేదు. ప్రభుత్వం పనితీరులా మినుకుమినుకుమంటోంది.

కొవ్వొత్తి గుడ్డి వెలుగులో సూర్యారావూ, లెనిన్, జమునా మాసిపోయిన జంబుఖానా మీద మాసిపోయిన చిత్రాల్లాగా కూచుని ఉన్నారు. కొవ్వొత్తి బంగారు కాంతి వాళ్ళ ముగ్గురి నీడల్ని గోడలమీద జీమూతాల్లాగా చూపిస్తోంది. జమున నీడ బుగ్గన చేర్చుకున్న చేతి బొటనవేలి నీడతో కలిసి బాగా పొడుగ్గా, ముక్కు సాగినట్టు వింత ఆకారంతో కనబడుతోంది.

నిజానికి ఆ నీడలే మా మా నిజ ప్రకృతులేమో!

ఈ కదుల్తున్న రక్తమాంస రూపాలు మా వికృత నీడల రూపాల నీడలేమో అనిపించిందో క్షణం.

ఆ మూడు నీడల్లో లెనిన్ నీడను నా నీడ చేరింది.

రెండు నీడలూ నల్ల పాదరసపు ముద్దలు కలుసుకున్నట్టు కలిసిపోయాయి. నిజంగా లెనిన్ నీడలో నేను కలిసిపోతే ఎంత బావుణ్ణు అన్న ఊహ ఒక్క క్షణం కలిగింది.

గోడకానుకుని జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించుకుని కూచున్నా. గది పక్కన్నే వర్క్‌షాపు నుంచి సమ్మెట శబ్దాలూ, వర్కర్ల అరుపులూ, ఇటువేపు హైవే బైపాస్ మించి తిరుగుతున్న లారీలూ, బస్సుల రొద.

ఇలాంటి చోట తప్పించి మాలాంటి నాటకాల కంపెనీకి సంసారులనబడే సభ్య నాగరికుల కాలనీల్లో గది దొరకదు.

నాటకాల వాళ్ళంటే నీతి, నియమాలూ తప్పినవాళ్ళు, ప్రపంచంలో ఉన్న అన్ని వ్యసనాలూ వాళ్ళకుంటాయి. ముఖ్యంగా ఆడవాళ్ళ రంగు పులుముకుని రంగమెక్కారంటే వాళ్ళు కాసుకు కళనే కాదు. ఒళ్ళును కూడా అమ్ముకుంటారన్న ఓ వికృత భావన నాగరిక సభ్య లోకమంతా అల్లుకుపోయింది.

ఆ వికృత భావనని మోసీ మోసీ, ఆ సభ్య నాగరికులు చూసే అసభ్య ఏహ్యపు చూపులు భరించీ భరించీ మావాళ్ళు కూడా రాటుదేలి, కసిగా ఇంకా ఇంకా భీభత్సంగా ప్రవర్తిస్తారు.

ఓసారి రాజమహేంద్రంలో ఈ జముననే హోటల్ గదిలో ఎవడో వచ్చి రమ్మని

పిలిచాడు. అలవోకగా వాణ్ణిచూసి, "అయిదు వేలు తీసుకురా" అంది.

వాడో బూతుమాట పేలి, "అంత రేటా" అన్నాడు.

"నా రేటంతే. నువ్వ భరించలేవుగానీ. మా డైరెక్టరు మాంచి ఊపుమీదున్నాడు. నేనే ఓ రెండువేలిస్తా. నీ భార్యని పిల్చుకురా' అంది.

వచ్చినవాడు ఆవేశం పట్టలేక నానా బీభత్సం సృష్టించాడా రోజున.

అంతే ఈ కళాకారులకీ, కళాకారులు కాని ప్రజానీకానికీ మధ్య ఓ గోడ ఉంది. ఉంటుంది. వాళ్ళూ, వీళ్ళూ ఏకం కాలేదు. కాలేరంతే.

విసురుగా వీచిన గాలికి గదిలో కొవ్వొత్తి ఆరిపోయింది. జమున కూచున్న జాగా తెలుసుకాబట్టి జేబిలో అగ్గిపెట్టె ఆమె వేపు విసిరా. "జమునా! వెలిగించు అన్నా.

"ఈ చీకట్లో నేనెవరిమీద పడి పోతానో అని... పరవాలేదు చీకటి బానేవుంది కానీ, సూర్యంగారూ సంగచ్చెప్పేయండి నాకింటి దగ్గర పనుంది" అంది జమున.

ఆ చీకట్లో జమున గొంతు చీకటంత మెత్తగా ఉంది. అంతే నిర్మలంగా కూడా.

నిజమే. నిర్మలమైన ఈ చీకట్ని కొవ్వొత్తి మసక వెల్తుర్తో కలుషితం చేయడం పాపమనిపించేట్టు.

"అవునూ త్వరగా చెప్పండి మాస్టారూ. నేనూవెళ్ళాలి. పావని ట్యూషన్నించీ ఇంటికి పిల్చుకెళ్ళాలి." లెనిన్ కూడా అన్నాడు.

లెనిన్ వాక్యం పూర్తి అయ్యీ అవకనే కరంటొచ్చింది.

చీకట్లోంచి చటుక్కున ఆవిర్భవించిన ఆ గది చిత్రం ఒక్క క్షణంపాటు అసహజంగా అనిపించింది. జమున కళ్ళు చిట్లిస్తూ చూసి, తన ఒళ్ళో పడ్డ అగ్గిపెట్టెని మళ్ళీ నావేపు విసిరేసి పళ్ళనీ తెరిచి నవ్వింది.

నాక్కూడా తొందరగా ఉంది - నాయగ్గాడి నాటు సరుకు ఎక్కడైపోతుందో ఏమో అని.

"సర్వోత్తమరావు వచ్చుంటే బావుండేది. అతని కోసమే ఆగాను. ఎందుకంటే, ఈ నాటకంలో మొత్తం పాత్రలు ఎనిమిది. రెండు స్త్రీ పాత్రలు. సరే స్త్రీ పాత్రలకెలాగూ జమునా, సుశీలా ఉన్నారు కాబట్టి వాళ్ళ నొదిలేద్దాం. ఇక మొత్తం ఆరు మేల్ రోల్స్. హీరో మనకు మన హీరోయే" అని లెనిన్ వేపు సాభిప్రాయంగా చూశాడు సూర్యారావు.

నేనూ, జమునా మామూలే అన్నట్లు తలాడించాం. మా అందర్లోకీ యువకుడూ, స్ఫురద్రూపీ లెనినే. అసలు దాదాపు మా కంపెనీ హీరోగానే చలామణి అవుతుంటాడు.

"నాటకం పేరు 'శిథిలనగరం' ఒరిజినల్‌గా బెంగాలీ నవల. దాన్ని కావేగో నాటకంగా మలిచాడు. కథ చెప్పుకుందామా?" మా అనుమతి కోసమన్నట్లు ఆగాడు

సూర్యారావు.

"ముందు ఫైనాన్స్ ఎవరు చేస్తున్నారో చెప్పండి". మొహమాటం లేకుండా అడిగింది జమున.

తాను చాలా ప్రాక్టికల్ మనిషి. తను ఇబ్బంది పడదు. మరొకళ్ళని ఇబ్బందికి గురిచేయదు. కానీ, ఆమె ఆ మాట అడిగే సరికి సూర్యారావు మొహం కొద్దిగా ముడుచుకుపోయింది. రెండు క్షణాల్లో తేరుకున్నాడు.

"నీతో వేగడం కష్టమే జమునా" అని చిన్నగా నవ్వి, "మిరియంపూడి నూనె మిల్లు ఓనరు స్పాన్సర్ చేస్తానన్నాడు. కానీ, ఆయన కూడా కథ వినాలి హీరో, హీరోయిన్నూ చూసిం తర్వాత చేస్తానన్నాడు. అతను కాకపోతే మరో వ్యక్తి దొరక్కపోడు. అంత వరకూ నేను ఖర్చు భరిస్తూనే ఉంటాగా. అదీకాక మూడు బహుమతులున్నాయి. మనకేదో ఓ బహుమతి రాకపోదు. చివరి బహుమతిపన్నెండువేలు. చాలా" అన్నాడు.

మూతి బిగించి నవ్వి, చాలదన్నట్టు తలడ్డంగా ఊపింది జమున.

"ఇంకేం కావాలట మరీ?" అడిగాడు సూర్యారావు.

"పోర్షన్లు సరే. మా కొంపల్లో మేం పల్లె వేసుకుంటాం. రిహార్సల్స్ కనీసం పదిహేను రోజులు పడుతుంది. ఆ పదిహేను రోజుల్సంగచ్చెప్పండి." నిర్మొహ మాటంగా అడిగేసిందామె.

నాకూ మనసులో ఏదో తెలీనీ ఊర్రట. ఆ పదిహేనురోజులూ రోజుకు యాభై అయినా రాలకపోతాయా అన్న ఆశ. నేనడగలేని మాట జమున అడిగేసినందుకు ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకున్నా లోలోపలే.

ఆమె వేపు తీక్షణంగా చూసి, "సరే ఆ రిహార్సల్స్ మొత్తం ఎన్ని రోజులో అన్ని యాభైలు నీకిస్తాను. సరేనా" అన్నాడు సూర్యారావు.

చేతులెండూ పైకెత్తి "చాలు. చాలు. రెండు గంటలకి యాభైరూపాయలు ఎక్కువే" అంది జమున.

మనఃస్ఫూర్తిగా గట్టిగా నవ్వాడు లెనిన్. నాకు తెల్సి లెనిన్‌కి డబ్బు అవసరం లేదు. అతను నాటకం కోసమే వస్తాడు. లెక్చరర్‌గా పన్చేస్తూ వ్యసనాలకిదూరంగా ఉన్న లెనిన్‌కి డబ్బవసరం లేకపోవచ్చు. కానీ, నా సంగతో? జమున సంగతి సరే తేల్చేశాడు. మిగిలినవాళ్ళ సంగతి కూడా తేల్చేస్తే బావుణ్ణుకదా అని లోలోపలే అనుకున్నా.

"మీకు మాత్రం రిహార్సల్స్‌కి ముప్పయ్యేనండీ." నా ఆలోచనల్ని విన్నాడేమో నన్నంత స్వచ్ఛంగా అన్నాడు సూర్యారావు నా వేపు తిరిగి.

"ఛఛ... డబ్బు గురించేముందిలెండి." లోలోపల ఆనందపడ్తూ అన్నా. కనీసం ముప్పయ్ అయినా వస్తాయి కదా అని. ఓ పదిహేను రోజులు రాత్రి? ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. చాలు చాలు అనుకున్నా.

"మళ్ళీ విడివిడిగా కబురుపెట్టను. ఆదివారం సాయంకాలం ఏడుకి అందరూ

వచ్చేయండి. కథా పాత్రల నిర్ణయం చేసేసుకుందాం." సూర్యారావు ఆ వాక్యం పూర్తి చేసేంతలోపల జమున కాళ్ళు చెప్పుల్లో ఉన్నాయి.

నలుగురం గది బైటికి వచ్చాం. సూర్యారావు లెనిన్ వేపు తిరిగ, "అబ్సర్డ్ డ్రామా గురించిన పూర్తి వివరాలు మీ లైబ్రరీలో దొరికితే తెచ్చివ్వగల్రా? బెకెట్ వెయిటింగ్ ఫారి గోడోట్ గురించి ఈ రోజున రివ్యూ చదివాను. హిందూ పేపర్లో" అన్నాడు.

"క్షమించండి, అది 'గోడో' అంతే. గోడోట్ కాదు. ఆఖర్న 'టీ' సైలెంట్? బెకెట్ గురించీ, ఆ అబ్సర్డ్ డ్రామా గురించీ వివరాలుదొరుకుతాయి. తెచ్చిస్తాను" అని మృదువుగా సూర్యారావు తప్పుని సరిదిద్ది,, "జమునా,నేనటే వెళ్తున్నా. వస్తారా డ్రాప్ చేస్తాను" అని జమునతో అన్నాడు.

జమునా, లెనిన్లు రద్దీలో కలిసిపోయారు.సూర్యారావు కదలబోతుంటే అతన్ని చేయి పట్టి ఆపాను. ఏమిటన్నట్టు చూశాడు.

"చెప్పాలో, చెప్పకూడదో తెలీదు కానీ, ఇంతకుమునుపు వస్తూంటే సుదర్శనం తగిలాడు దారిలో. ఏదో వాగాడు. "పోయిన డ్రామా తాలూకు డబ్బు గురించీ..." నసుగుతూ చెప్పా.

చిన్నగా నవ్వాడు సూర్యారావు తెలుసు అన్నట్టుగా తలపంకించి.

"మజ్జాన్నం వెళ్ళా వాళ్ళింటికి, సుశీలకి ఈ కొత్త నాటకం గురించి చెబుదామని. వాళ్ళ బాబుకి బాగా లేదని హాస్పిటల్కి తీసుకెళ్ళిందట. తానుఇంట్లో లేదు. సుదర్శనమున్నాడు. నన్నే అడిగాడు డైరెక్టుగా డబ్బివ్వమని. అతనిచేతికి డబ్బిస్తే అదేమవుతుందో నాకు తెలుసు. మొత్తం ఎంత లెక్క రావాల్సుందో అడిగి, సుశీలకి ఇస్తానని చెప్పా.ఏదోవాగాడు.సరే అతన్సంగతి తెల్సిందే కదా. వచ్చేశాను.నిజం చెప్పమంటారా? దాన్తాలూకు డబ్బు సుశీలకెప్పుడో ఇచ్చేశాను.ఆ విషయం సుదర్శనానికింకా తెలీదు. అదీ అసల్సంగతి" చెప్పాడు సూర్యారావు.

ఊహించిన సంగతే, వస్తానండీ. గుడ్నైట్ అన్చెప్పిసైకిలెక్కేశా.

✦ ✦ ✦

శ్రీ లక్ష్మివిలాస్ పక్కనించి... విస్తళ్ళ దిబ్బ దగ్గర మూగిన కుక్కల్ని, పందుల్ని తప్పించుకుంటూ....

పాదాల మీదికి సైకిల్ చక్రం చిమ్ముతున్న రొచ్చు చిట్లుతూంటే, ముక్కు బద్దలైయ్యే కంపుతో ఆ చీకటి సందులోంచి రసూల్ వర్క్షాపు చేరుకున్నాం...

దాన్ని అందరూవర్క్షాప్ అని అంటున్నా, అదిప్పుడో పాడుబడిన గరాజ్. సగం గోడలు కూలిపోయి, పైన రేకులు వాలిపోయి, ఓ పక్కన మూలగా పబ్లిక్ పాయిఖానాగా, ఇంకోమూల కుళ్ళిపోయిన మాంసపు ముద్దలు ధరించిన మానవ రూపాల మార్పిడితో జనాలు దాన్ని పిలిచేది "ముండల మూల'.. వెనకాల రోడ్డు వేపుకి దొంగసారా... ఆ రోడ్డు చిన్న గొందిలోకి కరిగి ప్రవహించేస్తూంది.

ఆ చీకట్లో దాదాపుగా. ప్రతొకరూ ప్రతి ఒకర్నీ గుర్తిస్తారు... ఏ అతీంద్రియ జ్ఞానమో అది అర్థం కాదు.

గోడవారగా సైకిల్ స్టాండ్ వేసి ఆ చీకట్లో సుదర్శనాన్ని వెదకడం మొదలు పెట్టాను. కనబడితే తప్పించుకుందామని.

"ముండల మూలన్నుంచి ఓ స్త్రీ పరిగెత్తుతూ వచ్చింది అరుస్తో. ఆ స్త్రీ ఆకారం వెనకే ఇంకో ఇద్దరు వచ్చారు, అంతే వేగంగా పరిగెత్తుతూ.

ఆ అడదాన్ని ఒకడురెక్కలిరిచి పట్టుకున్నాడు. ఇంకోడుమోకాలు మడిచి కడుపులో తన్నాడు.

"మొన్నట్తోనే పదకొండు దినాలాయ. ఈ దినానికి కల్సి నూట ముప్పై తీయ్" అని మొహం పగిలేట్టు కొట్టాడు మళ్ళీ.

"నీయమ్మ డాఫర్నాబట్టా. నీకెందుకోనరానికియ్యాల్రా పైసలు. నీయమ్మతోని జేపిచ్చు. నీయాలితోని జేపిచ్చు యాపారం. నువ్వెవుల్రా నాకు? థూ." కాండ్రించి వాడి మొహమ్మీద ఉమ్మిందామె.

"మొగమ్మీంద ఊంచుతావ? గుడిసేటి లంజా మాకు పైసలీయ్యక "ముండల మూలల యాపారం ఎవతె జేస్తదే? నెలకి ఆరు ఎయ్యిలకి పాడుకున్నా పాట. నీ మిండగాడు కడ్తడా. ఆ పైసలు తీయి. బయటిక్దియ్ పైసలు. నక్రాల్జేస్తే కాల్లించిపార్నూకుతా" అని ఆమెని ఒంగబెట్టి ధబీమని వీపుమీద బలంగా గుద్దాడు.

"అమ్మో నన్నుజంపుతున్నడే ఈ లంజా కొడ్కూ... వా..." అని గట్టిగా అరుస్తూ ఏడవ సాగిందామె.

ఇంకో ఇద్దరాడవాళ్ళు అటువైపుకి పరుగెత్తుకొచ్చారు. అందులో ఒకామె, "అన్నా! అన్నా! ఇడిసిపెట్టినా. తిక్కది తెలీక వాగుతోంది. మేమిప్పిచ్చాం పోనా. నీలెక్కయాటికీ బోదు. ఇడిసి పెట్టన్నా. సస్తది బక్కది" అని వాడి కాళ్ళు పట్టుకుంది.

"దాని కాన్నించి పైసల్రాకపోతే మిమ్ముల జంపుతా. మొగమ్మింద ఊంచుతదా. మొగమ్మింద" అని బూతులు తిడుతూవెళ్ళిపోయారిద్దరూ.

"ఆ నాబట్టల్తోని లిగాడి పెట్టుకున్నవ్ గదే తిక్కమొగందానా. బువ్వ యాడికెల్లి తిందామనుకున్నావ్. మన్నుల పొర్లించి కొట్రిసూడి. లెయ్" అని కిందపడినామెను లేపి తీసుకెళ్ళిపోయారా ఆడవాళ్ళిద్దరూ.

ఓ సీసా మూతకు పాత గుడ్డపీలిక వత్తిలా జేసి, ఆ సీసాలో కిరోసిన్ వేసి దీపంలా వెలిగించి, రెండుజెర్రీ క్యాన్లూ, ఓ అరడజను ప్లాస్టిక్ గ్లాసులూ పెట్టుకొని పడిపోయిన గోడ వారగా కూచునున్నాడు నాయక్.

ఆ సీసా దీపపు కాంతి అక్కడున్న చీకట్నీ, పాపాన్నీ జయించలేక బితుకూ బితుకూ అని చూస్తోంది. దాని దీపశిఖ నుంచి వెల్తురు కంటే కిరోసిన్ వాసన్తో ఉన్న పొగ ఎక్కువగా వస్తోంది.

దాని బలహీనమైన కాంతి అరడుగుల వరకే వ్యాపించుచుంది. ఆ వెలుగు

అంతరించి చీకటి మొదలైయ్యే చోట బీ తన రెండు బుట్టల్తో కూచునుంది.

ఆ కిరోసిన్ దీపపు వెలుగు ఆమెను ముక్కలు ముక్కలుగా చూపెడుతోంది.

రేగినజుత్తూ, ముడతలు ముడతలుగా వేల్లాడుతోన్న కుడి దవడా, ఓ బుట్ట మీదున్న ముంజేయీ, ఆ ముంజేతికున్న వెండి కడియం అంత మాత్రంగానే బీ కనబడుతోంది.

ఆ ముక్కలన్నీ చీకటిచీల్చుకుని 'బీ' అనే మానవ రూపం ధరించడానికి తీవ్ర యాతన చెందుతున్న భ్రాంతి కలుగుతుంది. నిజమే. ప్రతి మనిషిలోనూ ఎక్కువ భాగం చీకట్లోనే ఉంటుందన్న నిజస్పృహ కూడా కలుగుతోంది. చీకటి వెలుగుల ముక్కలు ముక్కల బీని చూస్తోంటే.

ఆ బీ చీకటి చిత్రం వెనక నాలుగైదు నీడలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి. నాకు తెలుసు. ఆ చీకట్లో ఎక్కడో సుదర్శనం తన గేలం చూపుల్తో దేవులాడ్తో చూస్తూంటాడు. అతని చూపులకి తగిలే లోపల ఓ రెండైపోవాలి.

జేబి లోంచి పర్స్‌తీసి ఓ పది కాయితంబయటికి తీసి నాయక్కి ఇచ్చా. వాడు దాన్ని వెనకా ముందలా ఓ నాలుగు సార్లు చూసి, ఓ ప్లాస్టిక్ గ్లాసులోకి సారా వంచి ఇచ్చాడు.

ఆ గ్లాసు చేత్తో పట్టుకుని ఆ మసక వెల్తురునించి చీకట్లోకి కాందిశీకుడిలా వలసపోయా.

గోడవారగా పడిపోయిన రాళ్ళలో ఓ పెద్దరాయి చూసుకుని కూచున్నా. అంతవరకు ఆ పెద్దరాయి పక్కన వెచ్చగా పడుకున్న ఓ గజ్జికుక్క 'కుయ్ కుయ్' మంటూ లేచిపోయింది.

గ్లాసును మొహం దగ్గరికి తీసుకున్నా. ఘాటుగా సారా వాసన్తో పాటు ఉచ్చా రొచ్చూ వాసనలు కలిసొచ్చాయి. కళ్ళు మూసుకుని ఒక్కసారి మింగేశా. ముక్కులోంచి నీళ్ళు కారాయి. నోటి నిండుగా లాలాజలం ఊరింది. 'త్ఫూ' అని ఉమ్మా.

అప్పుడ్చూసా. రెండు పాదాలు నా పక్కనే వచ్చి నిల్చున్నాయి. ఆ పాదాలనాసరా చేసుకుని ఓ మానవాకారం!

దొరికిపోయా. ఇకలాభంలేదు. సుదర్శనం.

జీవిత వాస్తవికతను ఒక్కసారి విస్మరించాలనిపించింది. అదే సాధ్యమైతే మనిషికి ఇన్ని బాధలూ, ఇంత బాంధవ్యం, ఈ జీవితం ఉండవేమో!

ఆ పాదాల మీద మొలిచిన నా చూపులు తీగలై పాకిపాకి అతని కళ్ళ కొలుకుల్ని పట్టుకు ఆగిపోయాయి.

"హి హి హి..." ఇకిలించాడు సుదర్శనం.

"ఆలస్యమైందిగా మీరెళ్ళిపోయుంటారని అనుకున్నా". అతనడక్కుండానే సంజాయిషీ ఇచ్చా.

"హి హిః.. నేనే కాదు. సర్వం కూడా ఉన్నాడిక్కడే. నువ్వు రావనే అనుకున్నా."

మనిషి ఊగిపోతున్నాడు. మొండిగోడ మీద చేయి ఆనించి నిలదొక్కుకున్నాడు.

"అడిగినావా ఆ నాకొడుకుని, పాత బాకీ గురించి?" ముద్దగా అడిగాడు.

"లేదండీ వీలేపళ్ళే. అందరూ ఉన్నారు. అందుకని అడగలే" అన్నా.

"అందరిముందే అడగాల నా కొడుకుని. బేషరమ్ నాకో గ్లాసేయించు." నిర్లజ్జగా అడిగాడు సూర్యారావును బేషరమ్ అంటూ.

అంతట్లోకి హరిసర్వోత్తమరావనిపేరు పెట్టుకున్న మహోత్తమ పురుష పుంగవుడు "ర్యాయ్ సుద్దిగా పుకట్ మాల్ తాగడం కాదు. చెప్పిన పన్జేయాల చూడు" అంటూ హి హి హీ" అని నవ్వి నావేపు తిరిగి, "ఫస్ట్ రౌండేనా" అన్నాడు.

సుదర్శనం నా వేపు తిరిగి వంకరగా నవ్వికన్నుగీటాడు. అతనిచీకటి మనసులో ఏ భావముందో... ఈ చీకట్లో కూచున్న నేను చదవలేను. ఎంత త్వరగా సాధ్యమైతే అంత త్వరగా ఆ ఇద్దర్నీ తప్పించుకుందామనుంది.

సర్వోత్తమ్రావెళ్ళి నాయక్ దగ్గర ఇంకోరెండుగ్లాసులేయించుకు తెచ్చి. ఒకటి సుదర్శనానికిచ్చాడు. ఇంకోటి ఒక్క గుక్కలో మింగేశాడు. మింగేసి, "ఏయ్ బూవమ్మా... నాల్గు దోసెలయ్" అని గట్టిగా అరిచాడు.

"దోసెలొద్దు సర్వం. ఇంటికి బోదాం పద. సుశీలతో అన్నం జేపిస్తా" ముందుకూ వెనక్కూ ఊగుతూ అన్నాడు సుదర్శనం.

"అన్నమొద్దులేరా సుద్దిగా. అడిగింది జూడుచాలు. హి హి హీ" అన్నాడు సర్వోత్తమ్రావు.

నాకు తెలిసిపోయింది నాలుగ్లాసుల నాటు సారా కోసం సుశీలనుఅమ్మాడు సుదర్శనం.

తాగే సారాతన్నుకుని బయటికొస్తుందేమో నన్నట్టు అనిపించింది.

సర్వోత్తమరావు చీకట్లో మళ్ళీ అరిచాడు.బీ వేపు తిరిగి, "సేయ్ ముసిల్దానా దోసెలేసియ్యే... నీ... చెవుడా నీకు" అని.

చీకటి వెలుగుల ముక్కల బీ కదిలింది. ఆ ముక్కలన్నీ ఒక్కటై లేచి నిలుచున్నాయి.

"మస్త్ జోర్గ అరుస్తున్నవ్...ఆ ఖొజ్జాగాన్తోని పాత బాకీ తీపిచ్చు. పెండ్లాంని సారా గిలాసుల్కి అమెతోన్కి దోసెల్కి అమ్మ బెట్టన్తెలదా?"

ఆ ముసలి ఆకారానికి అంత భయంకరమైన స్వరముంటుందని ఎవ్వరూ ఊహించలేరసలు.

"యాయ్.. నన్ను గొజ్జాగాడంటావే ముసిల్లంజా. నీకు నేను బాకీనా" అని అరుస్తూ తూలుతూవెళ్ళి సుదర్శనం కాలెత్తి బీ దోసెల బుట్ట విసురుగా తన్నాడు.కానీ, బుట్టకీ, తనకీ ఉన్న దూరాన్ని బేరీజు వేసుకోడానికి సారా మైకపు పొర అడ్డమొచ్చింది.

గాల్లో వేగంగా ఊగిన కాలుని బ్యాలెన్సు చేసుకోలేక ధబీమని మట్టిలో పడ్డాడు సుదర్శనం. లేవలేకపోతున్నాడు. సగం లేచి మళ్ళీ పడ్డాడు.

తెలిసిపోయింది. సుదర్శనం అవుటయిపోయాడు.

అస్తవ్యస్తంగా... వ్యక్తావ్యక్తంగా ఏవేవో పేలుతున్నాడు. లేవడానికి పోతూ మళ్ళీ పడుతున్నాడు.

సర్వోత్తమ్రావ్వేపూ, నా వేపూ చూస్తూ ఏదో అంటున్నాడు.

నాయక్ లేచి సుదర్శనం నడ్డిమీదకాల్తో బలంగా ఓ తన్ను తన్నాడు. సర్వోత్తమ్రావ్ ఏదో అనబోతుండగా పోలీస్ విజిల్స్. క్షణాల మీద నాయక్, బీ.., ముండల ఘూల మాలికలూ మాయమైపోయారు.

ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి, "ఏయ్ ఎవన్దిరా గీ సైకిల్? గా కొడుకెవ్వడ్రా..., అవుటై పన్నడూ" అంటూ నా సైకిల్ని తోసి కిందపడ్డసుదర్శనాన్ని కాల్తో కదిలిస్తూ అన్నారు.

సుదర్శనంలో చలనం ఆగిపోయింది. ఆ మట్టిలో రొచ్చులో ఆలోచనా రాహిత్యంతో పడున్న జంతు కళేబరంలా అలాగే పడున్నాడు.

సర్వోత్తమరావు ధైర్యంగానాభుజమ్మీద చెయ్యేసి 'పద" అన్నాడు.

"ఏయ్.. ఎవర్రా మీరు?" ఖాకీ కాఠిన్యం.

"ఏంలే సారూ. సందులో చీకటుంటే ఒంటికి పోయను వచ్చినం" అని నా చెవిలో, "పద పద" అన్నాడు.

కింద పడ్డ సైకిల్ని లేపి కదిలాం.

కానిస్టేబిల్స్ ఇద్దరూ మమ్మల్ని పట్టించుకోలేదు. శవంలా పడున్న సుదర్శనాన్ని దాటి ఆ చీకట్లో దేన్నో తెలిసున్న దాన్నే వెతుకుతున్నారు.

లక్ష్మీవిలాస్ పక్కసందులో కొచ్చింతార్వత సర్వోత్తమ్రావన్నాడు. "జేబులో లెక్కేమైనా ఉందా? ఉంటే చీప్ లిక్కర్ ఏసుకుందాం పద. నా దగ్గరో ముప్ఫై ఉన్నాయి ఆ సుదర్శనం గాడు నాలుగ్లాసులు ఖర్చు చేయించినాడు" అన్నాడు.

నాకు తెలుసు, నా జేబిలో ముప్ఫై రూపాయలున్నాయని. కానీ, సర్వోత్తమ్రావు జేబిలో అతనన్నట్లు ముప్ఫై ఉన్నయ్యో లేవో మాత్రం కచ్చితంగా తెలీదు.

అందుకే నా దగ్గరడబ్బుంది అని నేను కమిట్ కాకూడదు.వ్యసనపరుల్లో ఉన్న పరస్పర అపనమ్మకం మా ఇద్దరి మధ్యా దిగంబరంగా నాట్యం చేస్తోంది.

"ఉంటే, ఓ పదిరూపాయలుండొచ్చేమో. ఆ నాయక్కి పదిచ్చా. వాడు ఓ గ్లాసు మాత్రమే వేశాడు. ఇంతలో పోలీస్... ఆ ఇరవై కూడా లెనిన్ని అడిగి తీసుకున్నా."

సర్వోత్తమరావు నమ్ముతాడని ఆ అబద్ధం నేను చెప్పలేదు. ఒకవేళ నిజంగా నా దగ్గరంతే ఉన్నా కూడా అతను నమ్మడు. తనమీద తనకే నమ్మకం పోగొట్టే వ్యసనమిది. అది తెలిసీ నేనెందుకింకా దానికి బానిసగానే ఉన్నా. ఏమో నా నరాలకు తెలుసా సంగతి.

"ఫరవాలేదులే పద. ఓ క్వార్టరొస్తుంది. చెరో నైన్టీ కొడదాం." చీకట్లో కదిలాడు సర్వోత్తమరావు.

సర్వోత్తమరావనబడే హరిసర్వోత్తమరావు ఆర్ అండ్ బిలో గుమస్తా. నా కన్నా ఏడెనిమిదేళ్ళ చిన్నవాడే.నేను మీరూ మీరూ అని సంబోధించినా, అతను మాత్రం నన్ను 'నువ్వు' అనే సంబోధిస్తాడు. అతడు నన్నేకాదు, ఎవరినైనా సరే పరిచయమైన అయిదు నిముషాల్లో నువ్వు అనేస్తాడు. అవకాశమిస్తే ఒరేయ్ అని కూడా అనేస్తాడు. బ్రహ్మచారి. అలా అనడం కన్నా పెళ్ళి చేసుకోలేదూ అన్చెప్పడమే బెటరేమో. ఈ వ్యసనం లేదూ అన్చెప్పడానికి లేదు.

"సుదర్శనం..." గొణిగాను.

"తాగింది దిగిం తర్వాత వాడే పోతాళ్ళే ఇంటికి...మనంపోదాం పద. అవునూ సూర్యం రమ్మని పిలిపించినాడంట గదా? కొత్త డ్రామానా? కథ చెప్పినాడా?" అడిగాడు.

"లేదు. లేదు. మీరురాలేదని ఏమీ మాట్లాళ్ళే. ఆదివారం సాయంకాలం ఏడింటికి వచ్చేయండి అన్చెప్పాడంతే. ఏదో బెంగాలీ నవల్ట. ఒంగోల్లో పోటీ ఉందట. నాకంతే తెల్సుమరి" అన్నాడు.

"జమునొచ్చిందా?" అడిగాడు.

"ఆఁ"

"ఆ లెనిన్గాడూ, అదీ కలిసే వెళ్ళిపోయినారుగదా?"

అనవసరం విషయాలాలస నాకిబ్బందిగా అనిపిస్తోంది.

జమునని అదీ ఇదీ అన్డం, లెనిన్నివాడూ వీడూ అన్డం నాకు నచ్చదు.

"భలే సెటప్ లే వాళ్ళది. దానికెంతమందైనా సరిపోరులే. వీడెన్ని రోజులుంటాడు గానీ...' పచ్చిగా, అసహ్యంగా పొక్కురేగిన పుండులోంచి కారే రసి లాంటి మాటలు మాట్లాడుతున్నాడు సర్వోత్తమరావు.

సడన్గా వెనక్కి సైకిల్తిప్పి, "నేవెళ్తానండీ నాకు పనుంది" అని సైకిలెక్కేశా.

అతను వెనక నించి బూతులరుస్తూ పిలుస్తున్నాడు.

నేను చీకట్లో కలిసిపోయా.

సుదర్శనం ఏమైయ్యాడో, ఎలా ఉన్నాడో అన్న కుతూహలం కన్నా, పోలీస్ వెళ్ళి పోంగానే నాయక్ గాడు మళ్ళీ వచ్చుంటాడనే ఆశతో సైకిల్నిరసూల్ వర్క్‌షాపు వేపు మళ్ళించా.

గరాజు మొత్తం ఖాళీగాఉంది.

ఆ మురికీ రొచ్చూ దుర్గంధం చీకట్లో అచేతనంగా అలాగే పడున్నాడు సుదర్శనం. గట్టిగా తట్టి తట్టి లేపా. "ఆఁ ఊఁ" అనడం మినహా అస్సలు స్పృహ లేదనికి, వాంతి చేసుకున్నట్టున్నాడు. భరించలేని దుర్గంధంవస్తోంది అతనద్దగ్గర్నించీ. మెయిన్ రోడ్డు మీదకెళ్లి ఖాళీ రిక్షాను బేరమాడి పిల్చుకొచ్చా. రిక్షా, అతను ముందురసూల్ వర్క్‌షాపు అనగానే రానన్నాడు. నన్ను నిరసనగా చూశాడు. ఏహ్యంగా కూడా. కానీ, పరిస్థితి వివరించిం తర్వాత ఒప్పుకుని వచ్చాడు. ఇద్దరం కలిసి సుదర్శనాన్ని

రిక్షాలోకి చేర్చాం.

"ఉచ్చ పోసుకున్నాడయ్యా, కక్కు కూడా అయినట్టుంది. ఏంటికి కిందా మీదగాను తాగుతారో యేమో." విసుక్కున్నాడు రిక్షా అతను.

నేనుముందు సైకిల్మీద వెళ్తోంటే వెనక సుదర్శనం సజీవ శవం ఊరేగుతూ...

ఆ చీకటి తలుపులెత్తెరిచిన సుశీలనన్ను విస్తుబోయి చూసింది. 'మీరా! ఏమిటీ? ఎందుకూ' అన్నట్టు.

తల వెనక్కి తిప్పిరిక్షా వేపు చూపించా.

సుశీల కళ్ళు నన్ను నిలువెల్లా శోధించాయి. దానికి కారణం నేనేమోనని.

కాదూ కాదూ అని ఘోషించాలని నా ఆత్మ తపించింది.

చీర కుచ్చిళ్ళు బొడ్లో దోపుకుని గడపదాటింది సుశీల. నేను కోలుకునే లోపల రిక్షాలోంచి సుదర్శనాన్ని సగం బయటికి లాగేసిందామె.

"దయచేసి కొద్దిగా సాయంపట్టండి." చాచి మొహమ్మీద కొట్టినట్టు అంది.

నేనూ, రిక్షా అబ్బీ, సుశీలా - ముగ్గురం సుదర్శనాన్ని మోసి లోపల పడుకోబెట్టాం.

"ఆఁ... ఊఁ" అని మూలుగుతూనే ఉన్నాడు సుదర్శనం. కుడికాలు జాడిస్తూ "ఏయ్..! నీయమ్మ...! నిన్నూ..." అని అంటూనే ఉన్నాడు.

"అతనక్కడలా పడుంటే చూళ్ళేక తీసుకొచ్చా. నాకేమీ తెలీదు." ఆమె అడక్కుండానే సంజాయిషీ ఇచ్చా.

సుశీల ఓ నవ్వు నవ్వింది.

అయ్యా! రిచ్చా బాడిగీ" రిక్షా అతను వాకిట్లో కొచ్చి అడిగాడు. ఒక్క నిముషమాగాను సుశీల కదుల్తుందేమోనని. ఆమెలో చలనం లేదు. "చేసిన మంచితనపు నేరానికి శిక్ష ఖరీదు అయిదురూపాయలు" అనుకుని అతి భారంగా అతనికి అయిదు రూపాయలిచ్చి, "వెళ్తాను సుశీలా. సూర్యారావు ఆదివారం సాయంకాలం రమ్మన్నాడు. కొత్త నాటకంట. అతను కలుస్తాళ్ళే. ఉంటా" అని బైటికొస్తూ ఆమెను చూశా.

ఆమె అస్తవ్యస్తంగా పడున్న సుదర్శనాన్ని చూట్టం లేదు. నన్నూ చూట్టం లేదు. తెరిచిన తలుపు లోంచి బయటి ప్రపంచపు చీకట్లోకి చూస్తోంది. ఏదో సమాధి స్థితిలో ఉన్నట్టు.

నిజమే. ఏదో రహస్యమంత్రాన్ని సిద్ధింపచేసుకుని సమాధిలోకి వెళ్ళినట్టు శూన్యనేత్రాల్తో మహాయోగులకు సైతం అర్థం కాని మంత్రం సిద్ధింపజేసుకుని.

నిజమే. లేకపోతే ఇంతటి దౌర్భాగ్యాన్ని, అసహ్యాన్ని, భరించే శక్తి సామాన్యులకు సాధ్యం కాదు.

ఆమెనలా వదిలేసి వచ్చేశా.

✦ ✦ ✦

బయట మంచం వాల్చుకుని చుక్కలేనిమబ్బుల ఆకాశాన్ని చూస్తూ పడుకున్నా. కావేరీ, ప్రియా ఇద్దరూ కలిసే పడుకుంటారు.కావేరి ఎప్పుడు నిద్రపోతుందో తెలీదు. నేనెన్నింటికొచ్చినా ఠక్కున తలుపు తెరుస్తుంది. అన్నం పెడ్తుంది. "నీవన్నం తిన్నావా" అని నేనెన్నిసార్లడిగుంటానో వేళ్ళమీదలెక్క పెట్టవచ్చు.

ఈ రోజున చిరాగ్గా ఉండింటి నాకు. మందు దొరక్కపోడం, సుదర్శనం తాగి పడిపోడానికి నేనే కారణమన్నట్టు సుశీల చూట్టం, రసూల్ వర్క్‌షాపులో ఆ గొడవలు...

ఏమిటీ...?

ఏమిటీ ప్రపంచం?

ఈ అశాశ్వత ప్రపంచంలో కొన్ని కోట్ల సంవత్సరాలు జీవించబోయే వాళ్ళలా ఏమిటీ తపన? ఎందుకీ తాపత్రయం? ఏమో రేపు గురించిన ఆశనే ఈ యావత్త్రం చాన్నీ లాక్కుంటూ తీసుకెళ్తోందేమో!

కాకపోతే ఇన్నిన్ని నాగరికతలూ, చరిత్రలూ పుట్టుకొచ్చుండేవా?

ఒక్కసారిగా ఏదో తెలీని మంత్రాన్ని సిద్ధింపచేసుకుని, కాలం వెంట వెనక్కి ప్రయాణించాలనిపించింది. అలా అలా వెళ్తూ వెళ్తూ... చరిత్రల్నీ నాగరికతల్నీ గడిచి కాలం అంచుకు...మనిషి ఆవిర్భావం బిందువుకి చేరుకుంటే! ఇప్పుడు ఇప్పుడున్న చోటుకి నేడుఅనబడే ప్రస్తుత బిందువు దగ్గరికి మనిషన్నవాడూ ఎలా చేరుకున్నాడో తెలుస్తుంది కదా!

ఆ పురాతన మనిషిని ఇప్పటి మనిషి ఎప్పుడో పోగొట్టుకున్నాడు. వాడిని వాడు వెతుక్కునే దేవులాటలో మల్లగుల్లాలు పడ్తూ తన్నుకుంటూ గిలగిల లాడుతున్నాడు.

నిజమే, నన్ను నేను ఎప్పుడో పోగొట్టుకున్నాను. ఆ అసలు నన్ను నే ఎట్లా వెదుక్కోనూ?

ప్రపంచంలో ఇంకా అక్కడక్కడా అరకొరగాఉన్న మనుష్యుల్నీ, నిజాయితీని, మంచితనాన్నీ చూసినప్పుడల్లా, ఈ పోగొట్టుకున్నతనం ప్రస్ఫుటంగా కనబడుతుం టుంది.

ఈ వెలితీ, ఈ నిరాసక్తతా నన్ను స్తబ్దంగా మార్చేశాయేమో!

అలా అలా ఆలోచనల్తో సుషుప్తి డేరాలో దూరిపోయా.

చేతనాచేతన శకలాల మధ్య నేను కూడా తునాతునకలుగా పడిపోయి... మళ్ళీ చిన్నాబిన్న శకలాలను ఏరుకుంటూ... నన్ను నేను కూర్చుకుంటూ..

'హాఁ...'

'అఁ...అఁ...'

పూర్తయిన నేను!

అయిపోయింది.

కాశీభట్ల వేణుగోపాల్

అయిపోయిందైపోయింది ఇంకో ముక్కే....

అంతే!

ఒక్కటే!

ఒక్కటే!

ఎక్కడా... ఆ ఒక్క ముక్కా ఎక్కడా?

వెదుకు వెదుకు...!

సుప్త చైతన్యం!

లేవు లేవు.

విగత స్మృతులు.

చీకట్లూ వెలుగులూ గుట్టలు గుట్టలుగా.

వాటి మధ్య ఎక్కడో ఆ ఒక్క ముక్కా

ఎక్కడో?

తోడిపోయి తోడిపోయి!

చీకటి వెలుగులు!

ఆ ఒక్క ముక్కా దొరకట్లేదు. చెల్లా చెదురుగా రకరకాల దృశ్యాలని మోసి పక్కకు పారేస్తున్నా.

ప్రతి దృశ్యానికీ, ప్రతి చైతన్య స్మృతికీ పడి ఉన్న ముడతల చీకట్లలో కూడా వెదుకుతున్నా.

అలసిపోతున్నా.

చెమటలు చెమటలు.. చిన్నగా చినచిన్నగా పొటమరిస్తూ... పెద్ద బిందువులై.. చిన్నటి ధారలై.. కారిపోతూ కారిపోతూ..చెమటలు..

మోస్తూనే ఉన్నా చేతనాచేతన శకలాల్ని కుప్పలు తెప్పలుగా...!

అలసిపోతున్నా.

తడిసిపోతున్నా.

దాదాపుగా పూర్తయిన నేను!

నా ఎదురుగా ఇంకోనేను!

ఒకే ఒక్క ముక్క మాత్రం పూర్తికాక అసంపూర్ణమైన నేను!

సరిగ్గా ఒక్క ముక్క

ఒకే ఒక ముక్క

మొహం ముక్క

దొరికితే మాత్రం తీసి తగిలిస్తే

పూర్తిగా నేను పూర్తయిపోతాను.

మొహం ముక్కలేని ముక్కముక్కల నేను, నా ఎదురుగా ఆకాశంలాంటి శూన్యం మొహం ఉన్న చోటనిండిపోయి... నేను.. అసంపూర్ణంగా!

ఆ ఒక్క ముక్కా దొరకదేం?

ఎక్కడ దొరుకుతుందో నా మొహం?

ఎక్కడ పడిపోయిందో?

ఏ చీకటి చిరుగుల్లో పడి ఉందో!

దొరుకు దొరుకు..దొరకవే దొంగనా మొహమా దొరకవే.. ఏయ్... యేయే దొరుకూ.. దొరుకు..యేయ్!

ధనాల్ మని చప్పుడు

ఒక్కసారి ఉలిక్కిపడి లేచి కూచున్నా.

"నేనెళ్ళనా కుళాయి దగ్గరికి. ఆ మూలింటివెధవలు నోటికొచ్చినట్టు వాగుతారు. ఏం... మీ ఆయన్ని లేపి పంపు. ఒక్క బిందె మంచినీళ్ళు తెస్తే అరిగి పోతాడా?" గట్టిగా అరుస్తూ అంటోంది ప్రియ బిందెను ధనాల్మని కిందేసి.

"అరవకు... నీ వెళ్ళకపోతే నే తెస్తా. ఆయన్ననేహక్కు నీకులేదు" అంటూ దొర్లుతున్న బిందెని తీసుకుని నీళ్ళకి సిద్ధమైంది కావేరి.

"ఆఁహాఁహాఁ నిజ్జంగా మహా పతివ్రతవేనే నువ్వూ. మొగుడిని ఒక్క మాటంటే ఒక్కమాట పడనివ్వవూ. తే... ఆ బిందె. నన్ను సాధించేదాంట్లో ఓ వందో వంతు మీ ఆయన్ని సాధించు. ఈ కొంప సలక్షణంగా తయారౌతుంది". వాళ్ళమ్మ చేతిలో బిందెని విసురుగా లాక్కుని నన్ను నిరసనగా చూస్తూ బయటికెళ్ళబోయింది ప్రియ.

ఇంట్లో నుయ్యి ఉంది కానీ ఉప్పునీళ్ళు. తాగటానికి మాత్రం మునిసిపల్ పంపు నీళ్ళు ఓ బిందె తెచ్చుకోవాల్సిందే.

దిండుకింద తడిమా. కరుకుగా స్నేహం లేకుండా తగిలింది బీడీ కాయితం.

వ్యసనాల చుట్టూ జీవితమల్లుకునుందో, జీవితం చుట్టూ వ్యసనాలు అల్లుకున్నాయో. రాత్రిళ్ళు మాత్రం బీడీలు పెట్టుకుంటా దిండుకింద. అయిపోయాయి.

నెమ్మదిగా లేచి కదిలి ప్రియ చూపుల్ని తప్పించుకుని, బిందె తీసుకుని మునిసిపల్ పంపు దగ్గరికి బయల్దేరా.

మనిషి కనీసావసరాలలో ముఖ్యమైన నీటి గురించి ప్రభుత్వమెందుకు అస్సలుచర్య తీసుకోదూ.లేదూ చర్యతీసుకోబట్టే కనీసం ఈ వీధి వాళ్ళంతా తాగటానికి ఈ మాత్రమైనా పంపుద్వారా నీళ్ళొస్తున్నాయా? ఏమో రెండోదే సరైందేమో! రాత్రి సారా ఒక్క గ్లాసే తాగినందుకేమో మెదడుశుభ్రంగా తాజాగా ఉంది.

నాలుగు మెతుకులుముక్కనా నోటా కుక్కుని ఆఫీసుకి బయల్దేరడానికి బట్టలు వేసుకుంటున్నా. బయటి నుంచి సూర్యారావు గొంతు వినిపించింది. ప్రియని అడుగుతున్నాడాయన. "నాన్నగారు ఉన్నారమ్మా" అని.

"ఉన్నారు కూచోండి. ఆఫీసుకి రెడీ అవుతున్నారు."ప్రియ గొంతు.

నన్నెంత ఈసడించుకున్నా సభ్యతా సంస్కారమూ ప్రియ ఒంటినిండా ఉన్నాయి. నిజమే కావేరి చేసిన బొమ్మగదా!

ఒక్కసారి కావేరి మీద అపారమైన ప్రేమ పొంగుకొచ్చింది. తన పెంపకానికి. మళ్ళీ నాకే నవ్వొచ్చింది.

ఏమిటీ మానసికస్థితి? ఒక్క క్షణం నిర్వేదం, మరుక్షణం ఈ లౌకిక బాంధవ్యాల మీద వ్యామోహం. నా కొక్కడికేనా? అందరికీ, అన్ని దేశాల్లో, అన్ని జాతుల్లో, అన్ని సంస్కృతుల్లోనూ ఇలాంటి వైరుధ్య వికర్షణలుంటాయా?

లోపలికొస్తున్న ప్రియను అప్యాయంగా చూశా. ఒక్కసారి దగ్గరికి లాక్కుని అప్యాయంగా తలనిమురుస్తూ "అమ్మలూ! ఎంత సంస్కారముందే నీకు" అని చెప్పాలనిపించింది.

కానీ, ప్రియ కళ్ళలోకి చూడగానే భయం.

భయమేనా అది. కాదేమో. నా బాధ్యతల్ని నేను మర్చిపోయిన గిల్ట్. అపరాధ భావం. అవునవును.

ఈ అపరాధ భావంతోనే కళ్ళు దించుకుని బయటికొచ్చేశా.

సూర్యారావు నన్ను చూడగానే "కాదర్‌సాబ్ చనిపోయాట్టండీ మొన్న రాత్రిట. లెనిన్ చెప్పారు. ఇంకొంతమందిని పోగుచేసుకుని శవసంస్కారాలకీ, వాటికీ ఏర్పాటు చేస్తానని వెళ్ళారు. మీరీ రోజు సెలవు పెట్టాల్సొస్తుందేమో" అన్నాడు.

ఖాదర్! బుర్రకథల ఖాదర్ మైక్రోఫోన్లేకుండా మైలుదూరం వినిపించే కంఠంతో, రామరాజుని, భగత్ సింగునీ, పూర్ణమ్మనూ, ఝాన్సీని లైలా మజ్నూలనీ రక్తం జ్వలించేట్టూ, కళ్ళు చెమర్చేట్టూ, కళ్ళు నిండి కాసారాలైపోయేట్టు. వీరరౌద్ర భయానక కరుణాది నవరసాలను అన్నిట్నీ కసకసాపిండేస్తూ పాడే ఖాదర్! మరణించాడు. ఈ దేశంలో కళకంకితమైన నిర్మలమైన ఆత్మ ఇంకోటి మాయమైంది.

"పదండి... వాళ్ళింటికెళ్దామా" అన్నాను.

"ఊఁహుఁ... హాస్పిటలెక్కళ్దాం. శవాన్ని మార్చురీలో పెట్టారట. అతని పెద్ద కొడుకు భిలాయ్‌లో ఉన్నాట. అతనికి టెలిగ్రామో, ట్రంకాలో చేశారు. అతను వచ్చేవరకూ ఉంచమని ఖాదర్ భార్య అడిగిందిట. పాపం ఆ తల్లి, ఆ మిగిలిన ఆరుమందితో ఎట్లా బతుకుతుందో." దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు సూర్యారావు.

"మీరు సైకిలు వేసుకుని హాస్పిటల్కి వెళ్ళండి. నేను ఖాదర్ సాబ్ ఇంటికి వెళ్తాను" అన్నాడు.

సరేనన్నట్లు తలూపి నా 'ఓల్డ్ ఫెయిత్‌ఫుల్' హంబర్ సైకిలెక్కాను. నిన్ననే ఆ కుర్రాడు రిపేర్ చేసి బాగా ఆయిలూ అదీవేశాడు. స్మూత్‌గా వెళ్తోంది.

ఖాదర్ సాబ్ మరణించాడు. అన్న వార్తను మోసుకుని వెళ్తున్నా నేను. పాపం గవర్నమెంటు నించి రావాల్సిన పైకం అందిందో లేదో... కుటుంబ నియంత్రణ గురించిన బుర్రకథని ఊరూరా పల్లె పల్లే తిరిగి పాడాడు. బస్సుల్లేకపోతే ఎడ్లబండి మీదా, అవీ లేకపోతే నడుచుకుంటూ, తిండి ఉన్నా, తిప్పలు తప్పకపోయినా నిఖార్సయిన నిజం కాననుకోసమ్మాత్రం కాదు. కళ కోసమే.

కానీ, బిల్లు పాసుకాలేదు. ఈ రోజు రా, రేపురా, మాపురా అనిసర్కారీ నక్కలు.

నేనూ అంతేగా! చేతిలో నోటు పడకపోతే నోటు పుటప్ చేయను కదా!

ఈ ప్రపంచానికి విముక్తి లేదా? ఈ అవినీతీ, ఈ రోగమూ, ఈ దౌర్భాగ్యమూ ఇట్లా కొనసాగాల్సిందేనా?

నిన్నను కనిపించిన రూతమ్మ మొహం దీనంగాకనిపించింది కళ్ళముందు. గుండెల్లో కసుక్కున బల్లెం దిగినట్టనిపించింది.

కళ్ళు చెమ్మగిల్లాయి.

'లేదు లేదు రూతమ్మగారూ! తప్పక నయాపైసా తీసుకోకుండా మీపన్చేసేస్తా' అనుకున్నా.

ఏమో మళ్ళీ సహజాతాలు, భీకరాకారాలు ధరించి ఈ పశ్చాత్తాపభావాన్ని మింగేయవన్న గ్యారంటీ లేదు కదా! అట్లా ఆలోచిస్తూ మెల్లిగా సైకిల్ తొక్కుతున్నా. గాంధీ చౌక్ దగ్గర నర్సిమ్మ కనిపించి, "సార్సార్ సార్సార్" అని గట్టిగా పిలిచాడు.

వాడు మా ఆఫీసు స్వీపర్ నాగరత్న అన్న. నాగరత్న టెంపరరీ స్వీపరు. కంటెంజెన్సీలోంచి నెలకు రెండొందలు డ్రా చేసి ఆమెకిస్తూంటాం. ఉదయమో మాటు కసవు చిమ్మి, మధ్యాహ్నాలు క్యారేజీలు తెచ్చుకున్న వాళ్ళ క్యారేజీలు కడిగిచ్చేసి వెళ్ళిపోతూంటుంది.

నాకు తెలుసు. నాకేకాదు. మా తాలూకాఫీసులో చాలామందికి తెలుసు ఈ నాగరత్న. ఇదే నాగరత్న రాత్రి అయ్యేసరికి మరో రూపంలోకి మారిపోతుంది. శుష్కించిన తన కండల్ని బండ నాగరికత మీద ఆరేస్తుంది.

నాగరత్న అద్భుత సౌందర్యరాశి కాదు.

నవయౌవనంతో మిసమిసలాడ్తూండదు.

కనీసం ఆరోగ్యంగా కూడా ఉండదు.

కానీ, ఉద్ధృతంగా తన్నుకొచ్చే ఆ చీకటి కోరికకు, ఒక ప్రాకృతిక లిప్పకు, ఒక మృగ చేష్టకు ఆ విషయాల్తో నిమిత్తం లేదు. ఉండదు కూడా!

ఆడదీ, ఆడమాంసం, ఆడవాసనా అన్నవి తగిల్తే చాలు!

సైకిలాపి ఏమిటన్నట్టు చూశా వాడివేపు.

"సార్. నారత్నకి ఆ పోస్టు పర్మెంటుగానీకి చాంచుందంట గద్సా. గా పెద్ద సార్తోని మాట్లాడు. నీకూ గాయెన్కి కల్పి రెండు ఎయ్యిలిచ్చా. ఆకాడికి నాకాన్నించీ పైసా ఎల్లదు. చేపిచ్చుసా"

ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతిని గాంధీచౌక్ దగ్గర దిగంబరం చేస్తున్నాడీ నర్సిమ్మ అనబడే నరసింహులు అనబడే సాధారణ భారతదేశ పౌరుడు.

దూరంగా కలక్టరేట్ మీదెగురుతున్న జెండా సిగ్గు పడుతోంది. సర్కారీ జీతం తీసుకునే నా చెయ్యి తడబడుతోంది.

చౌక్‌లో గాంధీ బొమ్మ పళ్ళులేని ఓ పర్మనెంటు నవ్వు నవ్వుతోంది దీర్ఘంగా

నిట్టూర్చి.

"నర్సిమ్మా! నేనటు రాత్రొచ్చినప్పుడు మాట్లాడుతా. నేనిప్పుడు ఆఫీసుకి వెళ్ళట్లే. హాస్పిటల్కి వెళ్తున్నా."

"అదిగాచ్చా... గావల్నంటే ఇంగో అయిన్నూర్లిచ్చా. దాంతోని..." ఇంకా యేమో చెప్పబోయాడు.

"లేదు లేదు నర్సిమ్మా! నాకిప్పుడు నిజంగా టైం లేదు. నేనటు రాత్రి వస్తాను. తప్పకుండా మాట్లాడుతాను" అని వాడికిక మాట్లాడే అవకాశమివ్వకుండా సైకిలెక్కేశా.

నాకు తెల్సు నర్సిమ్మ ఏమనుకుంటూంటాడో. వాడు ఇవ్వజూపిన సొమ్ము నాకు చాల్లేదనీ, ఇంకో వెయ్యో రెండో ఎక్కువ కోరుకుంటూ నిరసనగా వెళ్ళిపోయా ననుకుంటాడు. మళ్ళీ కలిసినప్పుడు నా అవినీతి రేటు పెంచుతాడు. నాలోకి ఇంకో మేకు దిగగొడ్తాడు.

మనసు భారంగా అయిపోయింది. కలగాపులగంగా.

కావేరీ, పద్మప్రియా, సుశీలా, ఖాదర్ సాబ్, లెనిన్, సుదర్శనాలు, దోసలమ్మే బీ.. ముండల మూల భయంకరంగా బాధింపబడ్డ స్త్రీలూ... నర్సిమ్మ.. నాగరత్న.. అందరూ..అందరూ అందరి ముఖాలు ఒకదానిమీద ఇంకోటి సూపరింపోజైనట్టు... ముద్రలు పడ్తూ... పెద్ద ముద్దగా అయిపోయి నా ముఖాన్ని నేను అద్దంలో చూసు కుంటూంటే ఆ ముద్దగా అయిపోయిన అందరి ముఖాలూ కనిపించినట్టు... మొత్తం వ్యవస్థే నా ప్రతిబింబంగా గుండె వేగం పెరిగింది. నోరు తడి ఆరింది.

సైకిలు బరువైనట్టు తోచింది. నా చుట్టూ వున్న జన సందోహం ఒక్కసారిమాయమైనట్టు తోచింది.

"నేనెవరో నాకు.. చె...ప్పం....డీ" అని గట్టిగా అరవాలనిపించింది.

ఎవరు చెప్తారు? అందరూ వాళ్ళ వాళ్ళ అస్తిత్వాలని మరిచిపోయిన వాళ్ళే.

లేదు లేదు... అందరూ నాలాంటి వాళ్ళు కాదు! ఇంకా లెనినూ, జమునలూ, కావేరీ, ప్రియలూ, సూర్యారావులూ, ఖాదర్సాబ్లు బతికే ఉన్నారు!

అలాంటి జనాలు నా చుట్టూ బతికే ఉన్నారు. కాబట్టే నాలో ఈ అపరాధ భావం కలుగుతోంది. వీళ్ళల్లోని నీతీ నిజాయితీ, మానవత్వం, మంచితనాలనబడే కొలబద్దతో నన్ను నేను కొలుచుకుంటున్నాను కాబట్టే. నాలోని కురచదనం బయటపడుతోంది. పొడుగు పెరగాలన్న ఆరోగ్యవంతపు ఆలోచన్లు కలుగుతున్నాయి. పెదాల మీద ఓ చిరునవ్వు చిగురించింది.

ఇది కాగితప్పూల చిర్నవ్వు కాదు.

కమ్మటి పరిమాళాలు చల్లే,చీకటి అడవుల్లో పూచిన గుర్తు తెలీని ఓ... చిన్ని పూవు. మనిషిలోని ప్రకృతి పూచిన గురుతు!

✦ ✦ ✦

హాస్పిటల్ చేరుకున్నా. మార్చురీ ఎదురుగా జువ్విచెట్టుకు కట్టిన కట్టమీద

ఖాదర్ సాబ్ చిన్నకొడుకు హయాత్ కూచుని కనిపించాడు.

సైకిల్ స్టాండు వేసి వెళ్ళి వాడి పక్కన కూచున్నా.

వాడు నన్ను నిర్వికారంగా చూసి, "బాబా సచ్చిపాయగద... గోర్మెంటు పైసలు ఇంగ రావా" అనడిగాడు.

వాడి భుజం తట్టా, వస్తాయి వస్తాయన్నట్టు. నిజంగా వస్తాయో రావో నాకు తెలీదు.

ఖాదర్‌కు బుర్రకథ వృత్తికాదు. అది అతని ఆత్మ. ఆత్మని అమ్ముకునే వాళ్లుండరు. అతనూ, అతని చిన్నకొడుకు హయాత్ కల్సీ కార్పెంటరీ చేసుకుంటారు. పాట మీద మనసున్న ఖాదర్ సాబ్ గొప్ప కార్పెంటర్ కాలేకపోయాడు. చిన్నా చితకా పనులు మాత్రం చేయడమెుచ్చతనికి. అతనద్దగ్గర పన్నేర్చుకున్న వీడికేమాత్రం పనొస్తాందిక. అందుకే అతని సంసారం దారిద్ర్యరేఖ దిగువునే ఉంది. కుటుంబ నియంత్రణ గురించి ఊరూవాడా కథలుగా, పాటలుగా పాడిన ఖాదర్ సాబ్‌కి ఏడుగురు సంతానం. అందులో అయిదు మంది ఆడపిల్లలు.

"సార్... రాత్రి కాన్నించీ ఈన్నే కూసున్నా. ఆకలైతాంది. సా.." హయాత్ మాటలు. కడుపులో పిసికినట్లయింది.

తండ్రి మరణం వీణ్ణి కదిలించలేదా? లేదూ శరీరము మనసూ రెండూ వేరు వేరా? శరీరం లేకుండా మనసెట్లా ఉంటుందీ? శరీరముండి తీరాలి మనసు కోసమేనా? ఆ శరీరం నిలవడంకోసమే ఈ సహజాతాలున్నాయేమో!

భోజన నిద్రా భయ మైథునాలు. అనాది ఈ మనిషి మనుగడని కొనసాగించే ప్రయత్నంలో తమవంతు పాత్రల్ని అవి నిరామయంగా చేసుకుపోతుంటాయేమో!

వాడి వేపు చూశా.

అలసటా.. నిద్రలేమి.

వీటిల్ని అధిగమించి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఆ..క...లి..!

ఏమైనా తింటానికి వాడి దగ్గర డబ్బు లేదేమో.

నా దగ్గర ఇంకా నిన్నటి చిల్లర కొద్దిగా మిగిలుండాలి కదా. వాడికో పది రూపాయలిస్తే! కనీసం సిగరెట్టుకేనా జేబులో చిల్లరుండొద్దూ! ఈ మనసే, ఈ పనికి మాలిన మనసే ఇంతకుమునుపే ఒకే ఒక క్షణం క్రితం... మంచి గురించీ, మానవత్వం గురించీ, నీతి నిజాయితీ గురించీ, స్వార్థ రాహిత్యం గురించీఆలోచించిందీ మనసే!

ఛీ!

జేబులోంచి పర్స్ తీసి హయాత్‌కి ఓ పది కాగితమిచ్చి, "వెళ్ళు. వెళ్ళి ఏమైనా తినేసిరా. అంతవరకూ నేనిక్కడుంటాలే. త్వరగా వచ్చేయ్" అన్నా.

వాడు నిర్వికారంగా చూసి, ఆ పది నోటు తీసుకుని రెండడుగులువేసి, "సార్! సైకిల్దీసకపోతా. ఇప్పున్నే రెన్నిమిసాల్లో వచ్చేచ్చా" అని నా అంగీకారంతో

నిమిత్తం లేకుండా నా సైకిలెక్కి మాయమైపోయాడు.

మనసుకు కొద్దిగా గాయమైనట్టనిపించింది. ఎంత మంచైనా, మానవత్వమైనా కొద్దిపాటి. చాలా కొద్దిపాటి రికగ్నిషన్, గుర్తింపు కోరుకుంటాయేమో! వాడు నా మంచితనాన్ని గుర్తించలేదన్న బాధ వింతగా అనిపించింది.

ఇట్లా అనిపించడం మంచికీ, మానవత్వానికీ మచ్చనా?

కృతజ్ఞతలూ, అపరాధ భావాలూ వెల్లిబుచ్చనీయని నిర్మలమైన, స్వచ్ఛమైన అనాగరికత వాడిది. ఓ గ్రామీణ భావన.. ప్రాకృతికం అది.

సిగరెట్టు వెలిగించుకుని కాలుస్తూ చుట్టూ వున్న ప్రపంచాన్ని గమనిస్తూ కూర్చున్నా. నల్లటి పొగలు చిమ్ముతూ ఓ శిథిలమైన అంబాసిడర్ కారొచ్చి ఆగింది. అందులోంచి ముగ్గురు దిగారు. చుట్టూ ఎవరికోసమో కలయజూస్తున్నారు.

ఎక్కణ్ణించి ప్రత్యక్షమయ్యారో తెలీదు. ఖాకీడ్రెస్ వేసుకున్న ఇద్దరు వ్యక్తులు వాళ్ళ దగ్గరకొచ్చారు. ఆ ముగ్గుర్లో ఒక వ్యక్తి జేబులోంచి కాగితమ్ముక్కోటి తీసి ఆ ఖాకీల్లో ఒకర్కి చూపించారు. "ఇదిగో ఆరెమ్వో పర్మిషన్. ఇంక శవాన్ని మాకిచ్చేయండి. మేం ఊరికి పోవాలంటే చాలా టైం అవుతుంది" అన్నాడు.

ఖాకీల్లో ఇంకో వ్యక్తి ఆ కాగితాన్ని అతన్చేతిలోనే కుక్కి, "ఎమెల్సీ అయిందటగా, కానిస్టేబిలొచ్చిపాయ. మీ ఊరి ఆర్రై వొచ్చి ఈడ సర్టిఫై చేస్తే గానీ పీనిగె కదల్దని జెప్పె. అదో ఆడ వస్తాండాడు సూడు. ఆపీసీతోమాట్లాడు ఫో" అన్నాడు.

వాడి నోటి నిండా తాంబూలముంది. నోరు తెరిచి వాడు మాట్లాడుతూంటే కబేళాలో తలలేని మేక మొండెం గుర్తుకొస్తోంది. ఆరెమ్వో కాదు గదా సాక్షాత్తూ ఈ దేశాన్నేలే ప్రధాని వచ్చి కూడా వాడితో పన్చేయించలేడని నాకు తెలుసు. నాకే కాదు ఈ ప్రధానులకీ, ఈ ముఖ్యమంత్రులకీ, ఈ రాజకీయ నాయకులందరికీ తెలుసు. అయినా, వాళ్ళకు వాళ్ళ వోట్లూ, సీట్లూ తప్ప సామాజిక స్థితిగతుల్తో, ఈ అవ్యవస్థతో పని లేదు. నిజమే మరి. నేను లేనూ! నన్నెవరొచ్చి మార్చగలరు!

జమునా, లెనిన్లూ చెప్పే సమసమాజం గురించి వింటా. వాళ్ళు చేసే అవినీతి వ్యతిరేక పోరాటాలూ చూస్తా. ఒక ఆశయం కోసం వెంపర్లాడే వాళ్ళ నైతిక నిబద్ధతకి తలొంచుతా. కానీ...

కానీ... నేను మారుతానా, నా ... నాలోని నానా సహజాతాల భూతాలకీ బానిస కాకుండా ఉంటానా! నేను పోగొట్టుకున్న నన్ను నేను తిరిగీ పొందగలనా? నా ప్రియ.. నా కావేరీ...నన్ను ఓ తండ్రిగా, ఓ భర్తగా ప్రేమించగలరా! అసలు నా మీద నాకు గౌరవం కలిగే రోజు వస్తుందా! ఏమో?

వాళ్ళ గొడవ మీద ఆసక్తి కలుగుతోంది. వెళ్ళి కలగజేసుకుని మాట్లడి వివరాలు సేకరించాలన్న కుతూహలం!

కానీ, ఇంతలో లెనిన్ వెనక ఇంకో వ్యక్తిని ఎక్కించుకుని మోపెడ్ మీద వచ్చాడు. నన్ను చూసి నిర్వికారపు నవ్వొకటి నవ్వాడు. నా దగ్గరకొచ్చింతర్వాత

అన్నాడు. "నీకు తెలుసు, ఖాదర్ సాబ్ ఇంటి పరిస్థితి. అందరం కలిసి అతనికోసం ఓ ప్రోగ్రాం చేసి, వచ్చిన మొత్తాన్ని అతని కుటుంబానికివ్వాలని నిర్ణయించాం. ఇద్దరు స్మాల్ టైం సినీ కమేడియన్స్‌ని కూడా మాట్లాడేయడం జరిగిందనప్పుడే. ఈ ఆదివారం మనం ఫస్ట్ సిటింగ్‌అనుకున్నాం కదా. అది క్యాన్సిల్. టౌన్‌హాల్ మాట్లాడి వస్తున్నా. కామెడీ నైట్ కోసం. టికెట్స్ కూడా ప్రింటౌతున్నాయి. నీకో రెండు బుక్స్ పడతాయి. ఏమంటావ్?" ఊపిరి తీసుకుందుకు ఆగాడు.

"ఖాదర్ పెద్దబ్బాయి వచ్చేస్తాడా. భిలాయ్ అంటే దూరం కాదూ. ఎట్లా వస్తాడు, కనీసం ట్రెయిన్ కూడా లేదు. గేజ్ మార్పిడి అని ఉన్న లైను ఊడబీకి మూడేళ్లైంది" అడిగా.

హైదరాబాద్ వరకూ వచ్చాట్ట.... వచ్చేస్తాడు. మనం బాడీ క్లియర్ చేసుకుని వాళ్ళింటికి తీసికెళ్ళి పోదాం. జమున అక్కడే ఉంది. హరి కూడా ఉన్నాడు... సూ..." ఇంకేదో మాట్లాడే లోపు ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్ పక్కనించి తూలుతూ వస్తూ సుదర్శనం కనబడ్డాడు.

'ఛః, ఇతను కనీసం మొహమేనా కడుక్కొని ఉంటాడా.ఎంతైందీ టైం. ఇంకా పదకొండు. అప్పుడే తాగేశాడు. సుశీల ఇంకా ఇతన్తో కలిసుంటోందెందుకో నా కర్థం కాదు" ఏవగించుకున్నాడు లెనిన్.

సుదర్శనం దగ్గరికొచ్చాడు. లెనిన్ చెప్పింది నిజం. సుదర్శనం కనీసం మొహం కూడా కడుక్కోలేదు. అయినా, హాస్పిటల్కేలా వచ్చాడు. ఆలోచిస్తున్నా.

"ఒక్క పది ఉంటే ఇయ్యి. సాయంత్రమిస్తా" లెనిన్ భుజమ్మీద అశుభ్రమైన చెయ్యి వేసి అడిగాడు.

నాకర్థమైంది. అతను ఉదయాన్నే తాగలేదు. లేచి రాత్రి తాగిన తాగుడు పర్యవసానాన్ని వదిలించుకునే నెపంతో మళ్ళీ తాగడానికి బయల్దేరాడు. మేమెవ్వరం దొరక్కపోతే మేమెక్కడున్నామో వాకబుచేసి ఇక్కడికొచ్చుంటాడు వెదుకుతూ.

"ఛీః.. వెళ్ళండిక్కణ్ణించి. పది కాదు పైసా కూడా ఇవ్వను. సిగ్గు లేదూ మీకు? మీరు మనుషులేనా అసలు." కోపంతో ఊగిపోతున్నాడు లెనిన్. నేను కూడా తప్పు చేసినవాడిలా తలొంచుకుని నిలుచున్నా. సుదర్శనం కదల్లేదు. సరికదా, "ప్లీజ్ ఒక్క పదే. సాయంత్రమిచ్చేస్తా. ప్లీజ్. అర్జంటు.. నిజ్జంగా". దైన్యంగా, హీనంగా అడుక్కుంటున్నాడు. లెనిన్ నిస్సహాయంగా తల ఎటో తిప్పి చూస్తున్నాడు.

సుదర్శనం నా వేపు తిరిగి, "ఆ నా కొడుకెక్కడ వాడు నాకు పైసలియ్యాల నీకు తెల్సు కదా. సార్తో చెప్పు వాడిస్తేనే ఇచ్చేస్తా, ప్లీజ్."

సుదర్శనం వణుకుతున్నాడు. పిసరుకట్టిన ఎర్రటి కళ్ళు నీళ్ళు తేలాయి. "ప్లీజ్... ప్లీజ్" అంటూనే అటుపక్కకు తిరిగి బొళ్ళున వాంతి చేసుకున్నాడు. విపరీతమైన దుర్గంధం అతని కక్కులోంచి చుట్టుపక్కలంతా కమ్మేసింది.

లెనిన్, నేనూ దూరంగా వచ్చేశాం. సుదర్శనం తూలుతూ వెళ్ళి జువ్వి చెట్టు

కట్టమీద వాలిపడిపోయాడు.

"అయ్ డోంట్ పిటీ పీపుల్‌లైక్దిస్. ఇన్సెక్ట్స్. డర్టీ ఇన్సెక్ట్స్" పళ్ళు కొరుకుతూ అన్నాడు లెనిన్.

లెనిన్తో వచ్చిన వ్యక్తి ఖాదర్ సాబ్ బంధువో, చుట్టుపక్కల వాడో అయి ఉంటాడు.

"సార్! మోపెడ్ తీస్కుపోయి ట్యాక్సీ తెస్తా" అని లెనిన్‌కు మాట్లాడే అవకాశమివ్వకుండా వెళ్ళిపోయాడు. లెనిన్ పని ముఖ్యమన్నట్టు జేబులోంచి ఒక పేపరు తీసి ఆ ఖాకీ డ్రెస్ మార్చురీ వాళ్ళతో చెప్పాడు. "బాడీ తీసుకువెళ్తున్నాం. ఇదిగో ఆరెమ్వో పెర్మిషన్" అని వాడి చేతిలో పెట్టాడు.

వాడు లెనిన్ వంక భయంగా, భక్తిగా చూసినట్లనిపించింది నాకు. వాడేమళ్ళీ ముందుకు వచ్చిన వాళ్లతోటి అంటున్నాడు. "చూడు సార్!వాళ్ళ బాడీ ఇచ్చేస్తున్నాం ఇబ్బందులేం లేకపోతే. పీనిగల్తో మాకేం మోహమా" అన్నాడు. చూడండి. మేము చాలా నిజాయితీపరులం అని చెపుతున్నట్లు.

అంతలోనే ఖాదర్‌సాబ్ చిన్నకొడుకు నా సైకిల్మీద వచ్చేశాడు. వాడి కళ్ళల్లో ఆకలి తీరిన తృప్తి పచ్చిగా, దిగంబరంగా కనబడుతోంది.

కళాకారుడు ఖాదర్‌సాబ్ శవం టాక్సీ నేలమీద పడుకుంది. అతని గజ్జెలకీ అద్దాలు కుట్టిన అంగరఖాకీ, తంబురాకీ, తాళాలకీ, అతను తలకు చుట్టుకునే అతని భార్య గులాబీ రంగు నైలెక్స్ చీరకీ, ప్రాణాలుంటే అవీ నిర్జీవమై ఉంటాయేమో! ఎంతలో ఎంత మార్పు!

శవమై ఖాదర్‌సాబ్ మనిషి హోదా కోల్పోయి వస్తువైపోయాడు.

నేను చచ్చిపోతే..? అన్న ఆలోచన!

అమ్మో...!

నా సైకిలెక్కి నేనూ మోపెడ్ మీద లెనిన్.

టాక్సీలో ఖాదర్‌సాబ్ శవంతోపాటు అతని కొడుకూ, లెనిన్‌తోటి వచ్చిన వ్యక్తీ.

అందరం ఆ పీనుగలు గోదాం దగ్గర్నించి కదిలాం, ఊపిరి పీలుస్తూన్న సుదర్శనం శవాన్ని జువ్విచెట్టు కట్టమీద వదిలేసి.

✦ ✦ ✦

పెద్ద హంగామా, ఆర్భాటం లేకుండా ఖాదర్‌సాబ్ ఖననం జరిగిపోయింది.

కామెడీ నైట్ పేరులో అపహాస్యపు హాస్య విభావరీ జమాబందీ యావత్తూ ఖాదర్‌సాబ్ కుటుంబానికిచ్చేట్టు స్మశానంలో తీర్మానం అయిపోయింది.

లెనిన్ అట్నించటే కాలేజీకెళ్ళిపోయాడు. కుర్రాళ్ళకి కనీసం ఒక క్లాసైనా తీసుకుంటానంటూ.

ఎప్పటికప్పుడు లెనిన్‌ని నే భూతద్దాలోంచి శోధిస్తుంటాను. సామాజికుడిగా

లెనిన్లో ఏ ఒక్క చిన్న దోషమేనా కనబడకపోతుందా అని..

'ఊఁహూఁ..!'

నాలో తప్పులు, ఒప్పులూ అన్నీ నా వ్యక్తిగత జీవితానికే పరిమితం. సమాజంలోకి, సంఘంలోకీ వచ్చిం తర్వాత నేను నేనుకాను. వాటిలో ఓ భాగాన్ని కావాలి. ఏమో! నాకు తెలిసీ ఆ రెండు పాత్రల్నీ నిజాయితీగా పోషిస్తున్నాననే అనుకుంటాను" అంటాడు లెనిన్.

రాను రాను నాకు లెనిన్ అందనంత ఎత్తు ఎదిగిపోతున్నవాడిలా అయిపోతున్నాడు.

"నిజానికి అదినాకు నేను కుంచించుకుపోవడమే" అన్న సత్యాన్ని జీర్ణం చేసుకుందుకి మనసొప్పుకోదు.

అనాలోచితంగా సైకిల్ని ఆఫీసు వేపు మళ్ళించాను. ఆఫీసులోకి వెళ్ళకుండా బయట వేపచెట్టు కిందే సిగరెట్టు కాల్చుకుంటూ నిల్చున్నా.

మళ్ళీ నర్సిమ్ము కనిపించాడు.

"వీడు వదల్డు అనుకున్నా. వాడు ఈ మాటు కాస్త నిర్లక్ష్యంగా నవ్వుతూ వచ్చాడు దగ్గరికి. 'నమస్తే సార్' అని అనలే. వచ్చి ఎదురుగా నుంచుని ఇకిలించాడు. వాడి నిర్లక్ష్యానికి కారణం నా ముక్కుపుటాలకి సోకింది.

"సాయంత్రం అడ్డాకి రాసా... ఆడ మాట్లన్నీకి బాంటది" అని కన్ను గీటి వెళ్ళిపోయాడు.

బావుండడమేమిటో నాకు బాగా తెలుసు.

మనసంతా చీకాకుగా ఏదో అస్పష్ట వేదన, చేదూ నిండుకుని ఎలాగో ఉంది. 'ఇంటికెళ్ళిపోదాం' అనుకుని సైకిల్ స్టాండ్ తీశా.

శ్రీనివాసనగర్ టర్నింగ్ దగ్గర ఏదో ఒక గుంపు కనిపించింది. యథాలాపంగా చూశా. అందులో ప్రియ కనిపించింది. ఏదో ఆవేశంగా అంటోంది. అక్కడేదో గొడవ జరుగుతోందని అర్థమైపోయింది. గబగబా అక్కడికెళ్ళా.

"మరో మాటు ఇట్లా మాట్లాడితే చెప్పుతో కొడ్తాను. ఈడియట్" అని గట్టిగా అరిచింది ప్రియ.

నే గుంపులో జొరబడేసరికి ప్రియతో తిట్లు తిన్న కుర్రాడు విసురుగా వచ్చి ప్రియ పైట లాగాడు. నాకు విపరీతమైన ఆవేశమొచ్చింది.

"యూ బాస్టర్డ్" అని రెండు చేతుల్తోటీ ఆ కుర్రాడి తల మీద కొట్టాను.

"రేయ్ వాళ్ళ నాన్నరా పదండి. పదండి" అనిమిగిలిన కుర్రాళ్ళు వేగంగా అక్కణ్ణించి దూరంగా పోసాగారు. ప్రియని అల్లరిచేస్తున్న వాడు మాత్రం వెనక్కి తిరిగి రెండుచేతుల్తోటి నన్ను విసురుగా తోసేసి ఏదో బూతుమాట గొణిగి పారిపోయాడు. వాడు తోసిన తోపుకు వెళ్ళి చెత్తకుండీ మీద పడ్డాను. పగిలిపోయిన ఆ సిమెంటు కుండీలోంచి బయటి కొచ్చిన ఇనుపచువ్వ గుచ్చుకుని చెవ్వు వెనగ్గా

చీరుకుపోయింది. లేవబోయి తూలి మళ్ళీపడ్డాను. ఈ మాటు నుదుట మీద దెబ్బ తగిలింది. అట్లాగే కూచుండిపోయాను అసహాయంగా. ఎవరో చెయ్యి ఆసరా ఇచ్చి లేపారు. "ఆడపిల్లలు రోడ్డుమీద నడవడం కష్టమైపోయింది. పోయేకాలం దాపురించింది లోకానికి" అనెవరో అన్నారు.

నా ఎదురుగా కళ్ళనిండా నీళ్ళతో ప్రియ. ప్రియ చేతిలో పుస్తకాలు తీసుకుని సైకిల్ క్యారియర్కి పెట్టి పద అన్నట్టు చెయ్యి చాపాను.

"నాన్నా! రక్తం కారుతోంది నాన్నా." ఎడారి మండుటెండలో అలమటించి పోతున్న క్షణాన ఆకాశం ఒక్కసారి మేఘావృత్తమై అమృతధారలు కురిసినట్టుగా ప్రియ నన్ను "నాన్నా" అంది.

కళ్ళ నిండా నీళ్ళు నిండిపోయి చుట్టూ ఉన్న ప్రపంచం అస్పష్టంగా కనపడింది. తలవంచుకుని కళ్ళు తుడుచుకున్నా.

"వెనకల కూర్చుంటావామ్మా! త్వరగా వెళ్ళిపోదాం." అడిగాను ప్రియను. తలాడించింది.

క్యారియరుకున్న పుస్తకాలు తీసి ప్రియ చేతికిచ్చా. నా ఓల్డ్ ఫియత్‌ఫుల్ హంబర్ సైకిల్‌కి ఎక్కడలేని దర్జా వచ్చేసింది. ఏదో పూల రథంలో నా రాజకుమారి... మై ప్రిన్సస్.. మైలవ్లీ డాటర్ ప్రియని కూచోబెట్టుకుని తోలుతున్న భావన.

కావేరీ నోరు తెరుచుకుని చూస్తోంది. ఇంటి ముందు నే సైకిలాపేసరికి. సైకిలాపగానే పద్మప్రియ లోపలికి పరిగెత్తి పుస్తకాలు విసిరేసి వాళ్ళమ్మను కౌగలించుకు హోరున ఏడ్చేసింది.

"అమ్మా ప్రియా! నా తల్లీ! ఏమైందే చెప్పరా" అని కావేరి కూడా ఏడవడం మొదలుపెట్టింది.

"ఎవరో కుర్రాళ్ళు అల్లరిపెట్టారు కావేరీ రోడ్డుమీద. చిన్న గొడవ. మామూలే ఈ రోజుల్లో" అన్నాను.

నావేపు నిశితంగా చూసిన కావేరి, "అమ్మో! అదేమిటండీ రక్తం కార్తోంది. నుదుటిమీద కూడా. అయ్యో" అని ప్రియని వదిలి వచ్చి నన్ను రెండు చేతులూ పట్టుకుని ఊపుతూ అడిగింది. ఈలోపు ప్రియ వెళ్ళి నీళ్ళూ, పాత గుడ్డా తీసుకొచ్చింది.

నా రెండు గాయాలూ నాలోంచి పూచిన పువ్వులై పరిమళిస్తున్న భావన. ప్రియ నన్ను ప్రేమిస్తుందంటే నన్ను నేను అణువణువూ చీల్చుకోగలనన్న భావన.

తన గురించి అతి కొద్దిగా తాపత్రయపడితేనే ఇంత ఆనందముందే!

నన్ను నేను చీల్చుకోడం మొదలైంది. అవునవును. ఒక్కో పొరా విడదీసి నా లోపలికి, నా లోలోపలికి...

తన పిల్లల్ని తాను కాపాడుకునే యానిమల్ ఇన్‌స్టింక్ట్‌తో చేశానా ఆ పని? ప్రాకృతిక సహజాతం తప్ప ఆ సంఘటన వెనక ఇంకేమీ లేదా?

పశువుల్లో లోపించిన ఆత్మా, మనసూ అందులో లేవా?

ఏమిటీ అనుబంధం?

ఏమిటీ విచిత్ర భావనలు?

కళ్ళు మూసుకునలా కుర్చీలో కూచుండి పోయాను.

✦✦✦

సాయంకాలం ఏడూ ఆ ప్రాంతంలో లెనిన్ వచ్చాడు ఇంటికి. చెప్పాను రోడ్డు మీద జరిగిన సంగతి. లెనిన్ ప్రియని పిలిచి వివరాలడిగాడు. "రేపు ఉదయం నేనిలాగే వస్తాను. అమ్మాయితోపాటు కాలేజీకి వెళ్దాం. వెళ్ళి వాడిని వార్న్ చేద్దాం. కుర్రతనం అని సరిపెట్టుకుందుకి లేదు. మళ్ళీ ఇలాగే కంటిన్యూ అవుతే ఆ కుర్రాడి పేరెంట్స్‌తో మాట్లాడదాం" అని ప్రియ వేపు తిరిగి, "నువ్వేమీ భయపడకమ్మా. నథింగ్ విల్ హ్యాపెన్. వియ్ విల్ సీ దట్ హీ అపాలజైజెస్" అని హామీ ఇచ్చాడు లెనిన్.

"వెనక పెరట్లోకి వెళ్ళి కూచుందాం పద. అక్కడ చల్లగా ఉంటుంది" అని లేపా. అతనొచ్చిన కారణమడిగా.

"నువ్వొస్తావేమో సూర్యారావుగారి దగ్గరకి అని వచ్చా. ఎందుకో ఖాదర్‌సాబ్ మరణం కన్నా సుదర్శనం, సుశీలా గురించిన యోచనే ఎక్కువ బాధ కలిగిస్తోంది" అన్నాడు.

పొద్దున హాస్పిటల్ మార్చురీ ముందు కక్కుకుని పడిపోయిన సుదర్శనం గుర్తొచ్చాడు. నిన్న జరిగిన సంఘటన మొత్తం చెప్పాను లెనిన్‌కి.

అయ్ లోత్ దట్ మ్యాన్ హరి. నువ్వు కూడా... నీకు తెలుసు. నాకు తాగేవాళ్ళని చూస్తే అసహ్యం. మానేయ్.. ఏమవుతుందో చూస్తాను. ఆ మందు ఇచ్చే రెండు సెకండ్ల మత్తుకన్నా అది కలిగిస్తున్న ఇబ్బందుల్ని గుర్తించరేం మీరందరూ? ఆ ఇబ్బందులు గుర్తొచ్చినప్పుడు వాటి నుంచి తప్పించుకోవటానికి మళ్ళీ తాగుతారు. అసలు మీ... తాగు....." ఇంకా ఏమో చెప్పబోతూ కాఫీ గ్లాసుల్తో వచ్చిన కావేరిని చూసి ఆగిపోయాడు.

లెనిన్ చేతికి కాఫీ ఇచ్చి, "ఆ మధ్య లత కలిసినప్పుడు ఇల్లు మారాలని చెప్పింది మారుతున్నారాండీ?" అడిగింది కావేరి.

"మీకేమమ్మా సొంత ఇల్లు. మాబాధలు శత్రువులక్కూడా వద్దు. నిజంగా అద్దె ఇంట్లో బతుకులు కష్టమే. లేదూ ఎక్కడికెళ్ళినా మాకలాంటి ఓనర్లే దొరకడం జరుగుతోందో తెలీదు. లేదులేమ్మా. ఎల్.ఐ.సి. లోన్ అప్లై చేశాను. లెక్చరర్స్ కాలనీలో ప్లాట్ తీసుకున్నా కదా. ఓ రెండు రూములేసుకుంటాం. లత కూడా రోజూ పోరు, 'సొంత ఇల్లో సొంత ఇల్లో' అని అన్నాడు లెనిన్.

లెనిన్ బండిలో సూర్యారావు ఇంటికెళ్ళాం.

సూర్యారావు వంట చేసుకుంటున్నాడు. జమున వంటగది గడప మీద

కూచుని మాట్లాడుతోంది. "ఏమిటి మాస్టారూ మసాలా ఘాటు యమ జోరుగా వస్తోంది. మమ్మల్నీ ఉండిపొమ్మంటారా భోజనానికి." గట్టిగా అన్నాడు లెనిన్.

"పొద్దుటి పులుసుకి మళ్ళీ పోపు పెట్టుకుంటున్నా. ఉండిపోండి. మీరు తినే తిండికి గుప్పెడు బియ్యం అంతే" సూర్యారావన్నాడు.

"చూడండి. ఎందుకీ తిప్పలు నన్ను కట్టుకోమనండి. రెండు పూటలా కమ్మగా తినొచ్చు కదా?" జమున నవ్వుతూ అంది.

"ఒక్కడికే వండుకోలేక చస్తున్నా. ఇద్దరికి వండడం నా వల్ల కాదు తల్లీ. నీకో మహా నమస్కారం" రెండుచేతులెత్తి సూర్యారావన్నాడు.

ఆ కల్మషరాహిత్యంలో సూర్యారావు ఇల్లు ఎంతో పవిత్రంగా కనబడుతూ నన్ను ఏలియనేట్ చేస్తున్న భావన. అవునవును. నేనిలాంటి చోట ఉండడానికి అర్హత సంపాదించుకోవాలి అననిపిస్తోంది లోపల.

రాత్రి తొమ్మిదిన్నర వరకూ అక్కడే కూచున్నాం. సూర్యారావు డ్రామా గురించీ, స్టేజీ, సినిమాల గురించి ఆవేశంగా మాట్లాడాడు. అతను తనన్నాను మర్చిపోతాడ లాంటి విషయాలు మాట్లాడేప్పుడు కొత్తవాళ్ళకి నిజంగానే నాటకీయంగా ఉంటుంది. కొత్తవాళ్ళకే కాదునాటకాలాడే మాక్కూడాను.

జమున డైరెక్టుగా అనేస్తుంది కూడాను. "మనం స్టేజి మీద లేమండీ.. మామూలు భాష మాట్లాడండి విసుగేస్తుంది. ఆఖర్కి మీరు కలల్లో కనిపించినా కూడా ఈ నాటకాల భాష వాడి నన్ను చంపేస్తున్నారు మీరు" అని గట్టిగా నవ్వేసింది.

"అయితే, మాస్టారూ, జాగ్రత్తండోయ్. మీరు తన కల్లోకొచ్చేస్తున్నారని డైరెక్టుగా చెబ్తూ ఇండైరెక్టుగా ఇంకేదో చెప్తోంది జమున." లెనిన్ నవ్వుతూ అన్నాడు.

"మనమందరం వాస్తవ జీవితాలనుకుంటున్నవే కలలేమో. మనం కలల్లో చూసి గుర్తుంచుకున్న ముక్కలే మన నిజ జీవిత సంఘటనలేమో. అయినా, జమున కలల్లోకి నే వెళ్తే, రిక్షా ఎక్కేవాడు ట్యాక్సీ ఎక్కినట్టవుతుందేమో కదూ." కొద్దిగా నిర్వేదంతో సూర్యారావన్నాడు.

నిజానికి మాకు తెలుసు జమునా, సూర్యారావు ఇద్దరూ ఒకరంటే ఒకరు ఇష్టపడ్తారని. "త్వరలోనే భార్యాభర్తల వేషంవేయించేయాలి వాళ్ళచేత" అని లెనిన్ కూడా అన్నాడు నా తోటి.

జమున ఆరాధనగా సూర్యారావు వేపుచూస్తోంది. ఒక కళామూర్తి ఇంకో కళామూర్తిని చూసే కళాదృష్టితోనే చూస్తోంది. అక్కడ బతికి ప్రవహిస్తున్నదీ, ఆ నిశ్శబ్దంలో పరిమళిస్తున్నదీ, ప్రతి హృదయాన్ని అదృశ్యంగా తాకుతున్నదీ కళే!

జమునకి, సూర్యారావుకీ మధ్యనున్న సంబంధం ఏనాడో శారీరకావస్థని దాటిపోయింది. సూర్యారావుకి నలభై ఏడేళ్ళు. జమునకి ముప్పై ఆరు. అంతటి జమున సూర్యారావు ముందుచిన్నపిల్లలా ప్రవర్తిస్తూంటే ఎబ్బెట్టుగా ఉండదు. ఆమె మాటల్లో, చేతల్లో మనం చూసే నైర్మల్యం అది.

వాళ్ళిద్దరూ కలిసికట్టుగా కళను ఆశ్రయించారు నిజమైన కళాకారుల్లో ఉండాల్సిన అనునిత్యం ఎదగాలన్న తపన ఇద్దరిలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ముఖ్యంగా సూర్యారావులో. కళంటే చెబుతూ

"మన పాదాలు సముద్రపుటలలను తాకుతూండగా, మన అరికాళ్ళ కింద చర్మస్పర్శ నుంచి, మెత్తటి ఇసక దూరంగా జరుగుతూ మనం కిందికి కుంగుతూన్న అనుభూతి కలుగుతూన్నప్పుడు, మన చేతుల్ని, నింగికి చాచి, ఆకాశపు నీలిమను ఒకేసారి భౌతిక శరీరంతో స్పృశించడం అన్నమాట. అది ఎంత అసాధ్యమో ఓ కళ మీద పరిపూర్ణాధికారం సాధించడం కూడా అంతే సాధ్యం. అందుకే అసలు సిసలైన కళాకారుడు నిరంతరం ఎదుగుతూనే ఉంటాడు. ఎదుగుతూ ఎదుగుతూనే కళలో విలీనమైపోతాడు. అదే రససిద్ధి. తపస్సిద్ధి కూడాను. అలా కళలోకి ఐక్యమైపోయిన నిజమైన కళాకారుడు మన ఖాదర్‌సాబ్‌గారు..." బాధతోటీ, నిజాయితీతోటీ అన్నాడు సూర్యారావు.

వాతావరణం బరువుగా అయిపోయింది.

"జమునా పాట పాడు ప్లీజ్" అన్నాడు లెనిన్.

సూర్యారావు, జమునా ఇద్దరూ మంచి సంగీతజ్ఞులు. నేను రాసిన గీతాలకు సూర్యారావు బాణీలు కట్టాడు. జమున ఓ విధమైన కరకు గొంతుతో కమనీయమైన గానం చేస్తుంది. వాటిల్లోంచి చంద్ర కౌంస్‌లో బాణీ కట్టిన రాధిక విరహ గీతం జమున పాడింది.

"కొండ పాడిందీ- కోన పాడిందీ
కొండ కోనల వెదురు వేణువుపాడింది
పూవు పాడిందీ - పూవు రేకు పాడింది
గువ్వ పాడిందీ - గువ్వ గూడుపాడింది
మువ్వ పాడింది - ముంజేతి గాజు పాడింది
కన్ను పాడింది - కనురెప్ప పాడింది
కనురెప్పనంటిన కంటి కాటుక పాడింది
గోరు పాడిందీ - గోట పండిన గోరింట పాడింది
యమునమ్మ పాడిందీ సికతమ్మ పాడింది
రమ్మురమ్మనిన రావేరా మదనగోపాలా"

ఒక్కసారి గది నిండా మా మది నిండా ఓ అపరిచిత పురాతన పరిమళం నిండిపోయింది.

"ఇంత మంచి పాట రాసిన నువ్వు ఆ నాటు సారా తాగుతావంటే ఆశ్చర్యమేస్తుంది" చిన్నగా నవ్వుతూ అన్నాడు లెనిన్.

జమున ముందు, సూర్యారావు ముందూ ఆ విషయం నాకిబ్బంది కలిగిస్తుందని తెలుసు లెనిన్‌కి. అయినా, కావాలనే వాళ్ళముందు ఆ ప్రస్తావన

తెస్తాడు. నాతోటి ఆ అలవాటు మాన్పించి తీరుతానని పంతం పట్టాడె లెనిన్.

"ఆ మహాతల్లి ఏ విధమైన అబ్జెక్షనూ చెప్పకపోవడమే ఈయన ఆ తాగుడు మానకపోడానికి కారణం. ఇంట్లో కొద్దిపాటి రెసిస్టెన్సేనా వస్తూన్నది అదిగో ఆ అమ్మాయి ప్రియనుంచే. నిజానికీయన ఆ అమ్మాయికి భయపడ్తాడు. ఓ రోజు ఆ అమ్మాయితో నేనేస్వయంగా మాట్లాడి ఈయన్తోటి తాగడం మానిపించేస్తా" అంది జమున.

"ముందు నువ్వు ఇల్లాలివి కావాలనుకుంటూన్న ఈయన్తోటి మానిపించు. తర్వాత దేశోద్ధరణ చేద్దూగాని" అన్నాడు లెనిన్, సూర్యారావునిచూపిస్తూ.

"ఇప్పటివరకు ఈన ఏకాకే కాబట్టి ఫర్వాలేదు. నన్ను కట్టుకోడానికెందుకు భయపడ్తున్నాడు ఈననుకున్నారు మీరంతా. అదిగో ఆ సిగరెట్లూ, మందూ మానిపించేస్తాననే." తానూ గట్టిగా నవ్వుతూ అంది జమున.

నాకూ ఇబ్బంది పోయి నేనూ నవ్వాను హాయిగా.

జమునన్నది నిజమేనేమో కావేరేనాడూ నా తాగుడు గురించీ, సిగరెట్ల గురించీ ఓ ముక్క కూడా మాట్లాళ్ళేదు. ప్రియ నిరసించినా, తాను కూడా డైరెక్టుగా ఏనాడూ ఏమీ అన్లేదు.

ఒక్కసారి "నాన్నా!ప్లీజ్ తాక్కునాన్నా" అంటే నిజంగా మానేస్తానేమో!

కానీ, లోపల అప్పుడే నాలుక లాగడం మొదలైంది. లెనిన్ వాలకం చూస్తే వదిలేలా లేడు. నన్ను మోపెడ్ ఎక్కించుకుని ఇంటి దగ్గర డ్రాప్ చేసి వెళ్ళేలా ఉన్నాడు.

"నాకాకలేస్తోంది" అన్నాడు సూర్యారావు.

"వడ్డించమంటారా?" జమునడిగింది.

"ఏముందీ వడ్డించడానికీ? పొద్దుటి పులుసూ, పులిసిన మజ్జిగానూ. నేను వడ్డించుకుంటాను గానీ తల్లీ, నువ్వేమీ హంగామా చేయకు. ఓవరాక్షనూ వద్దు." నవ్వుతూ అని లేచాడు సూర్యారావు.

"అంటే, ఇక మమ్మల్ని దయచేయమనేనా స్వామీ. కారబ్బూందీ, మిర్చి బజ్జీ పొట్లాలేవీ? కనిపించట్లేదూ అంటే తీర్థకార్యక్రమాలు ఏవీ ఉన్నట్టు లేవీ రోజున. లేదూ దాచారా ఏ సొరుగులోనో. ఓవరాక్షనన్నారూ. స్టేజి మీద ఎలాగూ ఓ వరాక్షన్చేయనివ్వరు. కనీసమీ గ్రీన్‌రూములోనన్నా చేయనివ్వండి." జమున అటూ ఇటూ కలయజూస్తూ అంది.

ఆమెలోని స్వచ్ఛతకీ, నైర్మల్యానికి ముచ్చటేసింది.

"నిజమే జమునా. నిజమైన నటులకి రంగస్థలమే అస్సలు జీవితం. మిగిలిన భౌతిక జీవితమంతా ఓ పేద్ద గ్రీన్రూమే."

అతని వేపు జమునే కాదు నేనూ,లెనిన్ కూడా ఆరాధనగా చూశాము.

లెనిన్, నేనూ లేచాము. జమున తనకు అప్పుడే వెళ్ళే ఉద్దేశం లేనట్టు గోడకు చేరగిలి అలాగే కూచుండిపోయింది.

నాకు ఇక రూఢీగా తెలిసిపోయింది. లెనిన్ నన్ను ఇంట్లో వదిలి కానీ వెళ్ళడు. సారా కోసం నాలుక గుంజుతోంది. తప్పనిసరిఅన్నట్టు లెనిన్ మోపెడ్ వెనకల కూచున్నా.

ఇంటి ముందు ఆపాడు మోపెడ్. ఆపి స్టాండ్ వేశాడు. అంటే ఏమో మాట్లాడాలనే అని తెలిసిపోయింది.

"పద లోపల కూచుందాం" అన్నాను.

వద్దు. ఆగు. ఇక్కడే ఒక్కమాటంతే. ఉదయం సుదర్శనాన్ని చూశాం కదా. అతడి మీద అసహ్యం కంటే సుశీల మీద జాలి ఎక్కువగా ఉంది నాకు. కానీ, ఏమీ చేయలేని పరిస్థితి. 'నాకు అన్నంటూ ఎవ్వరూ లేరు. నేను నిన్నే నా అన్నయ్యగా చూసుకుంటాను. అందుకే నీ కన్నా చిన్నవాడినైనా నీ దగ్గర మొండికెత్తి తాగుడు మానిపించాలని ప్రయత్నిస్తూ నిన్ను విసిగిస్తున్నాను. నాకు తెలుసు. కానీ, నీకు స్పష్టంగా తెలియాల్సిందొకటే. నిన్ను నేను ఎప్పుడూ నా సొంత అన్నయ్య లాగేచూసుకున్నాను." మోపెడ్ స్టార్ట్ చేసి సర్రున వెళ్ళిపోయాడు లెనిన్.

అతను వదలిన శూన్యంలో అతని అప్యాయత, స్నేహం నిండిపోయాయి.

కళ్ళు తడితేలాయి.

పొగలాగా నడిచి లోపలికొచ్చా.

కావేరీ, ప్రియా కంచాలు పెట్టుకుంటున్నారు.

పడక్కుర్చీలో వాలిపోయా.

నన్ను చూసి కావేరి లేచొచ్చి, "భోజనం చేస్తారా.వడ్డించనా" అనడిగింది.

'వద్దు కావేరీ. మీరు తినండి.నాకిప్పుడే తినాలని లేదు. మీరు కానివ్వండి" అనికళ్ళు మూసుకున్నా.

ప్రియా, కావేరీ నిశ్శబ్దంగా అన్నాలు తింటున్నారు. బయటినించి, "సార్... సార్సార్" అని షబ్బీర్ గొంతు.

బయటికెళ్ళి, "ఏరా... ఈ టైంలో?" కొద్దిగా విసుగుతో.. లోపల నాలుక లాగుతోంది. 'సారా, సారా' అంటోంది ఆత్మ.

"సీయెన్నార్సారు ఈ లెక్క మీకిచ్చి రమ్మన్నా..." అనిజేబులోంచి ఓ కట్ట వంద నోట్లు తీసిచ్చాడు.

అర్థమైంది. సస్పెండెడ్ ఆర్డై, రీ ఇన్స్టేటై, అతనికి రావాల్సిన అరియర్స్ అన్నీవచ్చాయి. బిల్ ఈ రోజున తీసుకుని ఉంటాడు. ఏ బార్లోనో బట్వాడా జరిగుంటుంది. అటెండరుషబ్బీరుతోటి నా వాటా నాకు పంపించాడు సీయెన్నార్ అనబడే సి. నరసింహరాజు.

"రెండెయిలున్నయ్ సా... ఎంచుకోండి" షబ్బీర్ అన్నాడు.

అవినీతిలో నిజాయితీ ఒకటి విడ్డూరం. "సర్సరే..నువ్వెళ్ళు" అని వాడిని పంపించి, లోపలికొచ్చి, కుర్చీలో కూలబడ్డా. నాలుక లాగుతోంది. జేబులో రెండు

వేలు పదపదమంటున్నాయి. మంచి విస్కీ తాగొచ్చు ఈ వేళ. కుంటి మనసు అంటోంది.

'నీకు తెలియాల్సిందొకటే. నిన్ను నేను సొంత అన్నయ్యలాగా చూసుకున్నాను." లెనిన్.

"ఆ మహాతల్లి ఏ అబ్జక్షనూ చెప్పకపోవడమే" జమున

నిర్వికారంగా చూస్తున్న సుశీల.

మార్చురీ ముందు జువ్విచెట్టు కట్ట మీద కక్కుకుని పడిపోయిన సుదర్శనం.

"నాన్నా..." సాయంకాలం అప్యాయంగా పిల్చిన ప్రియ.

గుండె దడదడా కొట్టుకొంటోంది. చేతులు వణుకుతున్నాయి. నాలుక పిడచకట్టుకుపోతోంది. నరనరమూ 'సారా... సారా' అంటోంది. తల విదిల్చుకున్నా. కళ్ళు తెరిచా.

ఎదురుగా కావేరీ ఏదో పుస్తకం చదువుతోంది. వరండామూలకి ప్రియ పుస్తకాలూ, మోచేయీ మాత్రమే కనిపిస్తున్నాయి.

"కావేరీ." పిలిచా గొంతు బొంగురుగా, బరువుగా ఉంది.

ఉలిక్కిపడి లేచొచ్చింది కావేరీ.

జేబులోంచి షబ్బీరిచ్చిన రెండువేలూ తీశా. చేతులు వణుకుతన్నాయ్.

"ఇదుంచు. ఇందులో ఓ వెయ్యి పెట్టి అమ్మలూ, నువ్వూ బట్టలు తెచ్చుకోండి" అని కళ్ళు మూసుకుని తెరిచా, నోరెండిపోతోంది. "నీళ్ళివ్వు" అన్నట్టు సైగ చేశా.

కావేరి గబగబా వెళ్ళి నీళ్ళు తెచ్చింది. గ్లాసు పట్టుకుందామంటే భయమేస్తోంది. ఎక్కడ ఒలికిపోతాయే నీళ్ళు. నాకేమయిందోనని కావేరీ భయపడుతూందేమో.

అట్లాగే నీళ్ళు తాగా. కొద్దిగా. నిమ్మళించింది. కుర్చీపక్కన కూర్చొని కావేరీ నా చేతిమీద చేయి వేసి బిగుసుకుపోయింది.

"నిన్నట్లాగా కనీసం ఓ గ్లాసు పడితే బావుంటుంది. ఒక్కటి కచ్చితంగా ఒక్కటి చాలు." లోపల్నించి ఎవరో అతి దయనీయంగా అడుగుతున్నాడు.

గుండెవేగం ఇంకా ఎక్కువైనట్లనిపించింది. ఇక నా వల్ల కాదు అనుకుని లేచా. బయటికొచ్చేస్తుంటే కావేరి నిస్సహాయంగా చూస్తోంది. ప్రియ తలెత్తి చూసి మళ్ళీ పుస్తకాల్లోకి తల దించేసుకుంది. మామూలే అన్నట్టు.

సైకిల్ స్టాండ్ తీశా.

"తాక్కుంటే చచ్చిపోతానా?"

'ఛీ, ఏమిటింత దౌర్బల్యం?'

'ఈ గుండె ఇలా కొట్టుకోకుండా, ఈ నాలుకిలా పిడచకట్టకుండా, ఈ చేతులూ వణక్కుండా ఉంటే...? తాగనా...?'

ఓ నిర్ణయానికొచ్చేశా. చూద్దాం ఈరోజు ఒక్క రోజు తాక్కుండా ఉంటే

ఏమవుతుందో చూద్దాం.

సైకిల్ స్టాండ్ వేశా. చిన్నగా నడుచుకుంటూ పబ్లిక్ బూత్ దగ్గరికొచ్చి లెనిన్‌కి ఫోన్చేశా.

"వస్తున్నా. ఆగు. అయిదునిముషాల్లో నీదగ్గరుంటా" అన్నాడు.

చిన్నగా నడిచి ఇంట్లోపలికి వచ్చా. ఇది మామూలు కాదన్నట్టు ప్రియ ఆశ్చర్యంగా చూస్తోంది.

కావేరి భయం తానే అయింది. పడక్కుర్చీలో కూర్చున్నా. ఇంకో గ్లాసు నీళ్ళిమ్మని కావేరినడిగి తాగా.

తాక్కూడదని నిర్ణయం చేసుకున్న తర్వాత గుండెదడ కొద్దిగా తగ్గినట్టనిపించింది. నీళ్ళు తాగింతర్వాత నాలుక కొద్దిగా బెటరనిపించింది. అట్లా కళ్ళు మూసుకు కూచున్నా.

"ఒంట్లో బావుండలేదా?" దీనంగా అడిగింది కావేరి.

చిన్నగా నవ్వి, "ఏం కాలేదు. బానే ఉంది" అన్నా. కళ్ళు మూసుకుంటే ఏవేవో చిత్రాలు కదులుతున్నట్టు... నల్లటి ముద్దలు ముద్దలుగా ఏవో ఆకారాలు... కళ్ళ చుట్టూ వలయాలు తిరుగుతూ చిన్న చప్పుడు కూడా ఉలిక్కిపడేట్లు చేస్తోంది.

లెనిన్ వచ్చాడు. అతను రాగానే కావేరి నాకేమో అయ్యిందని నిశ్శబ్దంగా ఏడవడం మొదలుపెట్టింది. ప్రియ లేచొచ్చి వాళ్ళమ్మ భుజం చుట్టూ చెయ్యేసి నిలబడిపోయింది మౌనంగా.

"ఏమీ కాలేదమ్మా! ఒక్కయిదు నిముషాల్లో వచ్చేస్తాం. వచ్చింతర్వాత మాట్లాడ్తా" అని కావేరితో అని, "పద" అన్నాడు.

డాక్టరు చూసి నవ్వి, 'విత్ డ్రావల్ సిమ్టమ్స్. హేల్యూసినేషన్స్ ఉంటాయి కొద్దిగా. విల్ పవరుంటే యూ కెన్ ఓవర్కం. డోన్వర్రీ. ఓ రెండ్రోజులో, మూడ్రోజులో, మహా అయితే ఓ వారం రోజులుంటుందిలా. దాంతర్వాత నార్మల్సీ వచ్చేస్తుంది. అంతవరకూ ఉదయమోటీ రాత్రి పడుకునే ముందోటి ఈ టాబ్లెట్స్ వేసుకోండి. అబ్సల్యూట్లీ నథింగ్. ఆల్దబెస్ట్. అయ్ టూ వాజ్‌క్రానిక్ ఆల్కహాలిక్ వన్స్. అయ్ కెనండర్‌స్టాండ్" అని పంపించేశాడు.

బయటికి రాంగానే చేతులు గట్టిగా పట్టుకుని, "థాంక్యూ, థ్యాంకూ సోమచ్" అన్నాడు లెనిన్.

"లెనిన్, మాటివ్వలేను గానీ ప్రయత్నిస్తాను. నిజం చెబుతున్నా. ప్రయత్నిస్తా. నిజంగా ఇన్నాళ్ళూ నా మీద నాకు కంట్రోలుందనే భ్రమతోనే ఉన్నాను. అది లేదనీ, నేను కంట్రోల్నించి తప్పిపోతున్నాననీ తెలిసిపోయింది. అందుకే, దానికోసం మీ అందరి సహకారం నాక్కావాలి... ప్లీజ్" అన్నాను.

ఇల్లు చేరేటప్పటికి కావేరీ ఆత్రతతో ఎదురుచూస్తోంది. లెనిన్ మొహంలో నవ్వుచూడగానే, ఏదో మాట్లాడబోయింది మానేసింది.

లెనిన్ ప్రియను పిల్చి వెనకాల పెరట్లో కుర్చీలెయ్యమన్నాడు. కుర్చీలువేసి ప్రియ వెళ్ళిపోయింది. నన్నుపెరట్లో కూచోబెట్టి లెనిన్ కావేరీ తోటి, ప్రియ తోటి ఓ అయిదునిముషాలు మాట్లాడి వచ్చాడు.

"వాళ్ళిద్దరితోటీ మాట్లాడాను. మా అందరి సహకారం నీకెప్పుడూ ఉంటుంది. నువ్వు చెయ్యాల్సిందంతా ఒక్కటే ఒక్కటి. నీకు తాగాలనిపించినప్పుడు మాలో ఎవరో ఒకరికి నీకు తాగాలనుందన్న సంగతి చెప్పేయాలి. ఒకే" అన్నాడు నవ్వుతూ.

వెళ్తూ వెళ్తూ, "నాకు తెలుసు. ఓ రెండు పూటలు అన్నం సహించదు. ఫర్వాలేదు. దిగిన మాత్రం తిను. నీకిచ్చిన మాత్రలు నిద్రకు. ట్రాన్క్విలైజర్స్. ఇప్పుడోటేసుకుని కాసింత మజ్జిగన్నం తినేయ్. ఉదయాన్నే వస్తా. గుడ్‌నైట్" యుల్యనోవ్ ఇల్యిచ్ ఓ యుద్ధం జయించి వెళ్ళాడు.

కావేరి కంచంలో మజ్జిగన్నం కలుపుకొచ్చింది. వెనకనే ప్రియ చెంబులో నీళ్ళూ, గ్లాసూ తెచ్చి నా చేతికి మాత్రిచ్చి, "వియార్ విత్యూ నాన్నా" అనేసి వెళ్ళిపోయింది.

చాలు చాలు. నాక్కావలసింది దొరికింది ప్రియ నన్ను 'నాన్నా' అంది.

మాత్ర వేసుకుని కొద్దిగా మజ్జిగన్నం తిని, పడక్కు ఉపక్రమించా. నిద్రమాత్రలు పన్చేయట్లేదు. ఏవేవో బొమ్మలు... నీడలు ముద్దలుముద్దలుగా... కళ్ళ చుట్టూ వలయాలు నల్లగా... గుండెలోపల ఏదో పిట్ట ఎగిరినట్టు... టపటపా రెక్కలు కొట్టుకున్నట్టు...

చిన్న శబ్దానికి కూడా ఉలిక్కిపడ్తూ!

ఎప్పుడో చిన్నగా మగత పడితే రకరకాల ముఖాలు... ఎక్కడా పరిచయం లేని వీధులు,ఏవేవో ఎప్పుడూ వినని శబ్దాలు.

వీలు కాదని ప్రియ పుస్తకాల్లోంచి ఓ పుస్తకం చేతికి తీసుకున్నా. ఏదో జనరల్ నాలెడ్జి పుస్తకం. పోటీ పరీక్షలకిచదివేది. ప్రియ స్నేహితురాల్దట. సాయంత్రం వచ్చినప్పుడు మర్చిపోయిందట.

పుస్తకం తీసుకుని చదువుతున్నా.

ఐబన్ బతూతా ఎవరు?

'మేధావుల పుస్తకాలన్నీ వారి వారి కలలే. ఎవరన్నారీ మాట?

కార్ల్ మార్క్సును ప్రభావితం చేసిన స్విస్ జాతీయుడెవరు?

ఏ రామ్‌సెస్ కాలంలో ఈజిప్ట ఉచ్ఛస్థితిలో ఉంది?

ఇంకొన్ని సైన్సు ప్రశ్నలు.

కలగాపులగంగా...!

మధ్య మధ్య పుస్తకం పేజీమీద నల్లటి నీడల రూపంలో ఏవో అర్థం కాని బొమ్మలు.

తల విదిలిస్తే పేజీ మళ్ళీ మామూలే.

నన్నెవరో ఏదో నాలుగు ఇరుకు గోడల మధ్య పెట్టి బంధించేసిన భావన.

నిద్రమాత్ర ప్రభావం కొద్దిగా ఉంది. కళ్ళు అరమోడ్పులవుతున్నాయి. మగత పెరిగేకొద్దీ బొమ్మలు విపరీతమవుతున్నాయి.

కలలో...?

హెల్యూసినేషన్సా...?

అర్థం కాని పరిస్థితి.

మగతలో ఏదో కలలాంటి భావన. లెనిన్ పెద్ద బ్లాక్‌బోర్డు మీద ఊరికే ఇంటూ మార్కులు వేస్తూ వెళ్తున్నాడు. అప్పుడప్పుడు చేతులెత్తి గట్టిగా చప్పట్లు కొట్టి మళ్ళీ ఇంటూ మార్కులు వేస్తున్నాడు.

ఉన్నట్టుండి ఏదో ఇరుకు వీధి కింద రోడ్డు స్థానంలో బండలకు బదులుగా మడతేసిన కొత్త చీరలున్నాయి. ఆ రోడ్డు వారగా పడ్డ చిల్లర షబ్బీర్ ఏరుతున్నాడు. నేను నడుస్తున్నా. రోడ్డు పోను పోనూ ఇరుకవుతున్నది. చివరికో నూతిలోకి వెళ్ళిపోయింది రోడ్డు. వెనుతిరిగి చూశా. కావేరి నన్నే చూస్తోంది.

"కావేరీ బావిలోకి దూకాల్సిందేనా" అనడిగా.

"ఏమో నాకేం తెలుసూ. మజ్జిగన్నం కలుపుకోవాలి" అని వెళ్ళిపోయింది వేగంగా.

మళ్ళీముందుకు చూశా. ఇప్పుడు బావి లేదు. దానిస్థానే పడక కుర్చీలో ప్రియ కూచుని చేతిలో బెత్తం పట్టుకు ఊగుతోంది.

"అమ్మలూ... బావి ఏదీ?" అనడిగా.

"పుస్తకాల్లోకెళ్ళిపోయిందండీ. ఇరవై ఆరో పేజీలో కెళ్ళండి. ఐబన్ బతూతా కలుస్తాడు అతనడగండి" అని బెత్తంతో ఊపసాగింది. ఏ పుస్తకంలో ఇరవయ్యారో పేజీనో అడిగే లోపల ప్రియ మాయమైంది.

నాకు కోపమొచ్చింది. పిచ్చిగా అరిచి పరుగెత్తడం మొదలెట్టా.

నేనలాగే ఉన్నా. నా చుట్టుపక్కలవన్నీ నన్ను విడిచి వేగంగా వెళ్ళిపోతున్నాయ్.

రైలుపెట్టెలో ప్రయాణం లాగుంది.

ఇక లాభం లేదనుకొనిచేతులు చాచి గాల్లోకి ఎగిరా. వెళ్ళిపోతున్నా ఎగురుతూ ఎగురుతూ.. మధ్య మధ్య కరెంటు తీగలు అడ్డొస్తున్నాయి. తప్పించుకుంటూ ఎగురుతున్నా. నా వేగం మీద నా అదుపు తప్పింది. కొట్టుకుపోయి కొట్టుకుపోయి ఓ చోట పడిపోయా.

ఆయాసం!

చుట్టూ చూశా. శూన్యం నాలుగు దిశలా దిగంతం వరకూ పరచుకున్న మైదానం. ఎర్రని మట్టి మైదానం.

కలలో నా నిజ స్పృహ నశించిపోయింది. నేనెవరో మరిచిపోయా. విశ్వాంతరాళ రహస్యాలన్నీ పొరలు పొరలై నను కమ్మేసి పేలిపోయిన నక్షత్ర భావనగా నన్ను

శూన్యం చేసి.. నన్ను నేనుకోల్పోయా.

ఎవరు నేను. ఈ విశాలమైన మైదానమేమిటి?

ఆకాశం వేపు చూశా. ఊదారంగులో ఉంది. నన్ను నేనుకోల్పోయానేమి.

ఆకాశాన్ని 'ఊదా! ఊదా! నేనెవర్ని" అడిగా.

ఆకాశం "నేనలిగాగా అందుకే నా రంగు ఊ...దా" అంది.

ఎర్ర మైదానంలో మట్టిని పిడికిళ్ళ నిండా తీసుకుని ఆకాశమ్మీదకి విసిరేశా.

ఆకాశానికి కోపమొచ్చింది. బొరియాలిస్ ఆస్ట్రియాలిస్ కాంతుల్ని అటూ ఇటూ దిగంతాల నోళ్ళతో కక్కేసింది.

నా కాలి కింద నలిగిన మైదానంలో.

నా అడుగు ఎంత పురాతనం.

ఎవరో చప్పట్లు కొట్టారు. దూరంగా లెనిన్ నావేపు తల తిప్పి నాకు దూరంగా పరిగెడుతూ వెళ్ళిపోతూ.

దాహమేస్తోంది.

దాహం... దాహం... దాహం...!

మట్టిని చేతుల్తో తోడుతున్నా. ప్లాస్టిక్ గ్లాసు, ఇంకో ప్లాస్టిక్ గ్లాసు. ఇంకోటి... మరోటి.. ఎన్నో అన్నీ ఖాళీ ప్లాస్టిక్ గ్లాసులే. గ్లాసులన్నీ విసిరేశా.

ఉన్నట్టుండి సుదర్శనం ప్రత్యక్షమై ఖాళీ గ్లాసుల్ని నాకుతున్నాడు.

'ఉఫ్'మని ఓ పెద్ద నిట్టూర్పు విడిచా.

అది పెద్ద తుపానుగా మారిపోయింది. సుడిగాలులు.. ఎర్రటి మట్టి చుట్టుచుట్టుగా రేగుతో... నన్ను హీనం చేస్తో...నా ఊపిరే తుపానై నా మీదే తిరగబడింది.

దాహమేస్తోంది.

దాహం... దాహం... దాహం...!

నాలోంచి పంచభూతాలూ బయటకొచ్చేస్తాయేమో.

వద్దొద్దు. పంచభూతాల్లారా పారిపోవద్దు. నేనిప్పుడప్పుడే చిట్లిపోను. ఇంకా నాకో యుగం మిగిలుంది. అగండాగండి.. ఒక్కక్షణం నాకు దాహంగా ఉంది.

"బయల్దేరండి" ఎవర్దీ ఆ గొంతు.

"రైట్ సైడ్ విండో కర్టెన్ సరిచేయండి. ఆపై ఫోకస్ లైట్ ఈ కార్నర్కి ఫోకస్ చేయండి. జమునా నువ్వు ఓవర్యాక్షన్ చేయకు."

"అ...ఈ..." సూర్యారావు గొంతుకది.

"ఇప్పుడు మీదే ఎంట్రీ." జమున గొంతు.

"దాహమేస్తోంది. ప్లీజ్ ఒక్క గ్లాసు. అదుగో ఆ చివరి వరుసలో నాయక్ ఉన్నాడు. నాయక్... నాయక్.. ఒక్క గ్లాసు... ఒక్కటే ఒక్క గ్లా....సు...!"

"ఏమండీ, ఏమండీ!"

ఉలిక్కిపడి లేచా. ఒళ్ళంతా చెమటలు నోరెండిపోయింది. కావేరీ నా

మొహంలోకి భయంగాచూస్తోంది. కాళ్ళవేపు ప్రియ దీనంగా చూస్తోంది.

కలా?

అంత పెద్దకలా?

హేల్యూసినేషన్సా?

"కావేరీ... నీళ్ళు."

నీళ్ళు తాగి దిండుకు జారగిల పడుకున్నా.

ఎంత భయకంరమైన కల! అసలది కలేనా? ఎన్నిరోజులుంటుందిలా? ప్రతి రాత్రీ ఇలాగే ఉంటే భరించగలనా నేను?

కావేరి నా చేయి పట్టుకు కూచుంది.

ఆ విశాలమైన జాలి కళ్ళలోకి చూడగానే నా మీద నాకసహ్యం పుట్టుకొచ్చింది. నా కళ్ళనించి ధారగా నీళ్ళు కారసాగాయి.

ప్రియ నా దగ్గరగా వచ్చింది. వచ్చి ఇటువేపు కూచుని నా కళ్ళు తుడిచింది.

"నాన్నా... ప్లీజ్, మామయ్య చెప్పాడు. ఇలా ఉంటుందని...! పడుకో నాన్నా! నేనూ, అమ్మా ఇక్కడే ఉంటాం" అంది చేయిని నిండుగా పట్టుకుని.

చాలు చాలు. ఈ మాత్రం అసరా చాలు. ప్రియ పక్కన కూచోడం ఎంతో ఊరట కలిగించింది.

తెల్లవారేవరకూ అలాగే మగత, మెలకువల మధ్య ఉలికులికి పడుతున్నా.

ఆరున్నరకే వచ్చాడు లెనిన్. "గుడ్‌మానింగ్ హారిబుల్ నైట్ కదూ' అన్నాడు.

'రెండు అసదృశాలు మాట్లాడుతున్నావు" అని నవ్వాను.

నా నవ్వు నాకే నిర్మలంగా అనిపించింది. నీరసంతో కూడిన ఆకలి చుర్రుమంది. ఆరోగ్యంగా...

ఇద్దరం ఉడిపి హోటల్కెళ్ళి మేం తిని కావేరీకి ప్రియకీ ఇడ్లీలు కట్టించు కొచ్చాం.

కావేరి మొహంలో తెలీని భయం ద్యోతకమవుతోంది. నాకేదో పెద్ద జబ్బు చేసి తాగడం అదీ మానేశానని తన అనుమానం.

ప్రియ కూడా నాకేసి అనుమానంగా చూస్తున్న ఫీలింగ్!

రాత్రి ఇద్దరితోటి కూచోబెట్టి నిష్కల్మషంగా మాట్లాడాలి అని నిర్ణయించేసుకున్నా.

✦✦✦

రోజులు గడుస్తున్నాయి. నాలో ఏదో నూతనోత్తేజం. ప్రపంచం యావత్తూ కొత్తగా కనబడుతోంది. చిరాకు, నిర్వేదం, నిస్పృహ తగ్గిపోయాయి.

కావేరీలో భయం మాత్రం పోలేదింకా.

ప్రియక్కూడా పూర్తి నమ్మకం కలగలేదు.

మధ్యలో నేను, లెనిన్ ప్రియ కాలేజీకెళ్ళి ప్రియను గొడవ చేసిన కుర్రాడి

గురించి ప్రిన్సిపాల్తో కంప్లెయినిచ్చేశాం. ఆ కుర్రాడి తండ్రి ప్రముఖ సర్జన్, ప్రిన్సిపాల్ నేరుగా డాక్టర్ గారికి ఫోన్చేసి కాలేజీకి పిలిపించాడు.

ప్రిన్సిపాల్ గదిలో నేను,లెనిన్, డాక్టర్గారు, ప్రియ ఉన్నాం. ప్రిన్సిపాల్ జరిగింది డాక్టర్గారికి చెప్పాడు.

"వాడితో పబ్లిగ్గా అపాలజీ చెప్పిస్తా" అన్నారు డాక్టరుగారు ఆవేశంగా. "పిలిపించండి వాణ్ణి" అని ప్రిన్సిపాల్తో అన్నారాయన.

అటెండరెళ్ళి ఆ కుర్రాణ్ణి పిలుచుకొచ్చాడు. ఆ కుర్రాడు గదిలో కడుగెట్టాడో లేదో డాక్టర్గారు వెళ్ళి వాడిని తీవ్రంగా బాదసాగారు.

"బ్రూట్ యూ ఆర్నాట్ జస్ట్ టార్నిషింగ్ మై ఇమేజ్. డూ యూ అండర్స్టాండ్ వట్యు ఆర్ డూయింగ్ టు యువర్సెల్ఫ్... స్వైన్... పో రాస్కెల్. అపాజైజ్డట్ గాళ్" అని మెడపట్టుకు తోశారా కుర్రాణ్ణి ప్రియవైపు.

లెనిన్ లేచి డాక్టర్ గారిని పట్టుకున్నాడు. "అరే! మందలించాల్సింది పోయి వయసొచ్చిన అబ్బాయి నలా కొట్టడమేంటిసర్! ప్లీజ్. కీప్ యువర్ కూల్" అన్నాడు.

ఆ బీభత్సానికి భీతిల్లి ప్రియ హోరున ఏడుస్తూ గోడకి చేరగిలబడి కూలబడిపోయింది.

"లేదండీ.. ఇందులో పేరెంట్గా నా తప్పుకూడా ఉంది" అంటూ కూలబడి ఏడుస్తున్న ప్రియ దగ్గరకెళ్ళి తలమీద చెయ్యేసి, "పాపా! వాడి తరపున నేనడుగుతున్నా ప్లీజ్. క్షమించు తల్లీ."

ఆయనలా అనేసరికి పాపం ఆ కుర్రాడు కూడా "హో" అని ఏడవడం మొదలుపెట్టాడు.

లెనిన్ వెళ్ళి ఆ కుర్రాణ్ణి సముదాయించి, "చూడు బాబూ, ఈ రోజు నుంచి మీ ఇద్దరూ ఫ్రెండ్స్ ఒకే? కమాన్ ఫర్గెటెవ్రీథింగ్. అండ్ మేక్ ఫ్రెండ్స్ విత్హర్."

దాదాపు ఇరవై ఏళ్ళొచ్చినా పిల్లల్లో ఇంకా పసితనంఛాయలు పోవడం లేదీ జనరేషన్లో. ముందు తరాల్లోలాగా త్వరగా బాధ్యతలు మీద పడకపోవడం వల్లనేమో! అదే యాభై, అరవై దశకాల్లో ఇరవై ఏళ్ళకు పిల్లల తల్లితండ్రులయ్యేవాళ్ళు.

★ ★ ★

కాలం శక్తివంతమైంది. ఏమైనా చేయగల్దు. నలభై యిదేళ్ళ నాలోనూ. కాలం మార్పు తెచ్చింది. తాగుడు మానింతర్వాత సైకిల్ వేగంగా తొక్కుతున్నా.ఆకలి ఎక్కువైంది. ముఖ్యంగా కావేరిని చూస్తే భయమేస్తోంది. తనని తాకాలంటే జంకు. ఇంతకు మునుపు శరీరంలో ఉన్న జడత్వం కరుగుతోంది.

ఓ రోజు మధ్యాహ్నం భోజనానికొచ్చినవాడిని ధైర్యం చేసి దగ్గరకు తీసుకున్నా.

తనని తాకి నేను ఎన్నిరోజులైందో. రోజులేమిటి ఏళ్ళు. గుర్తులేదు.

కావేరి విశాలమైన కళ్ళనిండా నీళ్ళు నిండి జలజలా రాలిపోయాయి. మంచమ్మీద కూచుని రెండుచేతుల్లో ముఖాన్నికప్పుకుని ఏడవసాగింది.

నాలో ఏదో అపరాధ భావన.

"కా...వేరీ... సారీ" అన్నా ఆమెకు దూరంగా కుర్చీలో కూచుని.

సుడిగాల్లా లేచొచ్చి నా కాళ్ళ దగ్గర కూచుని నా ఒళ్ళో తలపెట్టి నిశ్శబ్దంగా రోదించసాగింది తను.

తల నిమురుతూ మళ్ళీ ఇంకోసారి "సారీ" అన్నా.

"నా.. నాకు బాధ కాదండీ. మీ... మీలో మార్పును నేను తట్టుకోలేక పోతున్నానంతే. నాకు జరిగిందంతా కలలా అనిపిస్తోంది. అసలు నాదేనా ఈ జీవితం అనిపిస్తోంది". నా కాళ్ళను మరింతగా పెనవేసుకుపోయింది.

మెరుపులు లేవు.

తుఫాను కాదు.

విపరీత దాహార్తి కాదు...

సంరంభం కాదు.

అగ్నిపర్వతాలు విస్ఫోటించలేదు.

మేఘాలు కమ్మిన ఉదయంలా, ఏటి అలల మీది పిల్ల తెమ్మెరలా..

పల్చటి మీగడ కట్టిన గోరువెచ్చని పాలు తాగినట్టు...

సాయం సంధ్యలోకి..

ఓ మనసు నించి ఇంకో మనసులోకి...

కన్నీటి నించి కన్నీటికి కలసి పయనించినట్టు. వెన్నెల్లో రెల్లు పూలూగినట్టు.

ఇసుకలోకి వానచుక్కల మల్లే ఒకర్లో ఒకళ్ళం ఇంకిపోయాం.

✦ ✦ ✦

'శిథిల నగరం' రిహార్సర్స్ చురుగ్గానే సాగుతున్నాయి. సుశీల మాత్రం రెగ్యులర్‌గా రాలేకపోతోంది. సుదర్శనం ఇంకా మితిమీరిపోయాడు. ఈ మధ్యలో ఓ రెండుమూడు సార్లు మా ప్రభ్యాత నాట్యమండలి గదికొచ్చి సూర్యారావుతో గొడవ పెట్టుకున్నాడు కూడాను. ఎంత మైకంలో ఉన్నాసరే లెనిన్ని చూస్తే భయపడ్తాడు సుదర్శనం. హరి సర్వోత్తమరావు వెకిలి మాటలు అలాగే ఉన్నాయి.

ఓ రోజు ఆదివారం. ఉదయం పదకొండు గంటలకే రిహార్సల్స్ అనుకున్నాం. నేను, లెనిన్, జమున, సూర్యారావూ నలుగురం గదిలో కూచుని మాట్లాడుకుంటున్నాం. అప్పటికింకా హరి, సుశీల, బుజ్జబ్బాయనబడే ఇంకో క్యారెక్టరూ రాలేదు. బుజ్జబ్బాయిని జమున పిల్చుకొచ్చింది నాలుగో మగ పాత్ర కోసమని. తానేమో తన పాత్రేమో. అతనెవ్వర్తోటీ మాట్లాడను కూడా మాట్లాడ్డు బుజ్జబ్బాయి. పేరుబుజ్జబ్బాయే గానీ మనిషి భారీ విగ్రహం. మాట చాలా నెమ్మది. మా కండిషన్లన్నిటికీ ఒప్పుకున్నాడు అదీ ముఖ్యం.

విజయనగరం జిల్లా గరివిడిలో జరిగిన పదకొండు రాష్ట్రాల నాటక కళాకారుల సమ్మేళనం గురించి చెప్తున్నారు సూర్యారావు.

మధ్యప్రదేశ్ సత్యజిత్ భట్టాచార్య నిర్వహిస్తున్న అభియాన్ సంస్థ గురించి, ఒరిస్సా సంతోష్ దాస్ డిపి రిక్రియేషన్ క్లబ్ గురించీ, ఇప్టా బిలాయ్ అధ్యక్షుడు రాజేష్ శ్రీవాత్సవ గురించీ చాలా చాలా అవేశంగా మాట్లాడుతున్నాడు సూర్యారావు.

ద డెత్ ఆఫ్ ఆర్ట్ ఈజే నేషనల్ కలామిటీ అంటాడు అభినవ నాటకరంగ నిర్మాత కాంస్టెన్టైన్ స్టానిస్లవిస్కీ బర్తోల్ట్ బ్రెఖ్ట్ ప్రభావంతో భట్టాచార్య సీఖో దోస్త్ సీఖో వీది నాటకాన్ని అభియాన్ సంస్థ ద్వారా ఎంత పాపులర్ చేశాడు. అసలు మనదేశ మేధావులు నిలువ నీటి చేపల్లా మారిపోయారు. ప్రస్తుతం మన సమాజంలో గురువులు లేరు,టీచర్లే ఉన్నారు.గురువు అనేవాడు విద్యార్థిని ఆశీర్వదించి వాడి భవిష్యత్తును రూపకల్పన చేస్తాడు. టీచర్లు విద్యను అమ్ముకుంటారు' అంటూ 'మా సంస్థ బస్తర్... చెప్పబోతున్న సూర్యారావు ఠక్కున ఆపేశాడు.

గదిముందు ఆటో దిగింది. ఆటోలోంచి సుశీల, ఆమె బాబూ దిగారు. పరుగులాంటి నడకతో లోపలికొచ్చి ఎవర్నీ ఉద్దేశించకుండా, 'ఆటోకి డబ్బులిచ్చి పంపేయండి" అంది వణుకుతున్న గొంతుకతో.

లెనిన్ లేచి బయటికెళ్ళాడు. సుశీల నిలువెల్లా వణికిపోతోంది. తలంతా రేగి బట్టలు నలిగీ దుమ్ముకొట్టుకునుంది.

జమున లేచి సుశీల చుట్టూ చేతులు వేసి కూచోబెట్టి," ఏమైంది .. ఎందుకలా ఉన్నావ్.. చెప్పు. మంచినీళ్ళు తాగుతావా" అనడిగింది.

లెనిన్ ఆటో బాడుగ ఇచ్చి లోపలికొచ్చాడు.

"వా....డి...ని, వాడిని...నేను, చం.... పే...శా...ను."

ఒక్కొక్క మాటా విడివిడిగా అంటూ, స్పష్టంగా మెల్లిగా ఉచ్ఛరించింది.

నా గుండె ఒక్కసారి కొట్టుకోవడం మానేసి మళ్ళీ దడదడలాడింది.

"సుశీలా! సరిగ్గా చెప్పు. ఎవర్ని? సుదర్శనాన్నా ఏం జరిగింది? చంపడమేమిటి?" జమున ముక్కలు ముక్కలుగా ప్రశ్నించింది సుశీలని.

సుశీల బాబుని దగ్గరికి తీసుకు మౌనంగా తలఅడ్డంగా ఊపుతూ కూచుండిపోయింది.

"పోనీ మేం బయటికి వెళ్తే నీతో చెబుతుందేమో. పదండి లెనిన్ మనమలా వెళ్దాం" అంటూ సూర్యారావు లేవబోయాడు.

"వద్దు.. వద్దు. ఎవరూ వెళ్ళద్దు. ఇక్కడే ఉండండి. మీరే నాకు దిక్కు రోజురోజుకీ వాడి హింస భరించడం కష్టమైపోయింది. రోజూ ఉన్న కష్టమే కదా అలవాటైపోయిందనుకుంటే, ఈ రోజు... ఈ రోజు ఆ లంజాకొడుకు..." భోరున ఏడవడం మొదలుపెట్టింది సుశీల. సుశీల ఏడవడంతో ఆమె బాబూ ఏడవడం మొదలు పెట్టాడు.

"బీస్ట్... వాణ్ణీ..." పళ్ళు కొరుకుతూ అన్నాడు లెనిన్.

"చెప్పు సుశీలా చెప్పేయ్. ఏమేనా మేం చేయాల్సింది ఉంటే త్వరగా యాక్షన్

తీసుకునేందుకు వీలుంటుంది చెప్పు. ..." సూర్యారావు అన్నాడు.

"వాణ్ణి చంపేశానే జమునా! వాడు, వాడీరోజున ఇద్దరుసినిమా వాళ్ళంటూ ఇంటికి పిల్చుకొచ్చాడు. వాడి జేబునిండా డబ్బుంది. అన్ని వందరూపాయలే. వచ్చి నన్ను వాళ్ళిద్దర్తోటీ.. జమునా, ఎట్లా చెప్పేదే నీకు. వీడియో తీస్తారటనే... నన్నే జమునా.... అన్నయ్యా, సూర్యంగారు.. రోకల్తో... చంపేశా... వాణ్ణి చంపేశా.. తల పగలగొట్టేశా. పడుంది వాడి శవం ఇంకా ఇంట్లోనే. లెనిన్‌గారూ.. జమునా.. చంపేశా ఆ పందిని... వచ్చేశా పారిపోయి.. నా బాబు... బాబు.. వీణ్ణి మీరే ...పోలీస్..." స్పృహ తప్పి పడిపోయింది సుశీల.

అందర్లోకి త్వరగా రియాక్టయింది లెనిన్. నా భుజం తట్టి "పద" అన్నాడు.

జమున సుశీలకు పరిచర్యలుచేస్తోంటే, నేను, లెనిన్ బయటకొచ్చేశాం లెనిన్ మోపెడ్ స్టార్ట్ చేశాడు. వెనకాల కూచున్నా. తిన్నగా తీసికెళ్ళి సుశీల ఇంటిముందు ఆపాడు మోపెడ్ని.

చుట్టుపక్కలంతా ప్రశాంతంగా ఉంది. నేను సుశీల ఇంటిముందు ఓ పెద్ద గుంపును ఊహించుకుంటూ వచ్చా. ఎవరూ లేరు. చుట్టుపక్కల వాళ్ళు ఏదో మామూలు గొడవ ఎప్పుడూ ఉండేదేలే అనుకునుంటారు.

లోపలికెళ్ళాం. సుదర్శనం పడున్నాడు. తల పగిలి రక్తం మడుగు కట్టింది.

లెనిన్ వంగి ముక్కుదగ్గర వేలుపెట్టి చూశాడు. "హీయీజలైవ్. ఆటో పిల్చుకురా. పాపం పిచ్చిది ఈ పశువు నిజంగా చచ్చిపోయాడని భయపడిపోయింది. త్వరగా వెళ్లు" అన్నాడు లెనిన్.

హాస్పిటల్లో ఎమ్మెల్సీ అని డ్యూటీ సీఎమ్మో గొడవ పెట్టుకున్నాడు. "చూడండ్సార్ ఇతను తప్పతాగి ఇంట్లో రోలుమీద పడ్డాడు. ఏదో మానవతా దృష్టితో తీసుకొచ్చాం. ఎమ్మెల్సీయే అంటారా ఫర్వాలేదు కానివ్వండి. త్రీ టౌన్ సియై వెంకటేశ్వర్రెడ్డితో నేను పర్సనల్గా మాట్లాడి వస్తాను. కావాలంటే యాక్సిడెంట్ గురించి రిపోర్ట్ కూడా చేసి కానిస్టేబిల్ని పిల్చుకువస్తాను. సరేనా. మీరు దయచేసి అతన్ని ఎటెండ్చేయండి" అన్నాడు.

లెనిన్ అంత స్వచ్ఛంగా అబద్ధం చెప్పగల్డని మొట్టమొదటిసారి తెలిసింది నాకు.

డాక్టర్, లెనిన్ మాట్లాడిన తీరుకు కన్విన్స్ అయి, "ఒకే. నా ప్రాబ్లమ్స్ నాకుంటాయి కదా. అందుకనే అలా అన్నాను. అందునా అయ్ నో యూ. మై డాటర్ ఈజ్యువర్ స్టూడెంట్."

డాక్టర్కి థాంక్స్ చెప్పి క్యాజువాలిటీ నించి బయటికొచ్చేశాం. "ఇక ఆ పశువు చచ్చినా ఫర్వాలేదు..." కసిగా అన్నాడు లెనిన్.

మా అదృష్టం సియై వెంకటేశ్వర్రెడ్డి స్టేషన్లోనే ఉన్నాడు. అతను, లెనిన్ క్లాస్మేట్స్. అతన్ని ఊళ్ళో అందరూ రౌడీ పోలీస్ అనంటారు. లెనినెంత నిఖార్సో అతనూ

అంతే. లెనిన్కి ఖాకీ తొడిగినట్టుంటాడు.

వెళ్ళగానే, "రారా. ఎవర్నైనా మర్డర్చేసొస్తున్నావా? లేదూ పాఠాలు సరిగా చెప్పలేదని కొలీగ్నెవర్నన్నా కొట్టొస్తున్నావా. హాహాహా" అని పెద్దగా నవ్వుతూ నాతో చేయి కలిపి, "హలో సార్! బావున్నారా. కొత్త ప్లే వేస్తున్నారట కదూ. వీడు చెప్పాడు మొన్న. పాప బావుందా? ఏదో గొడవ అన్నాడు వీడు. మళ్ళీ దాని గురించి ఏమీ అన్లేదు మరి" అన్నాడు అభిమానంగా.

అంటే ప్రియ గొడవ ఎట్నుంచెటు వస్తుందో అని ఈ జాగ్రత్త కూడా పడ్డాడన్నమాట లెనిన్. అతని ఆలోచనకీ, నామీద ఉన్న అభిమానానికి మరోసారి కుంగిపోవాల్సొచ్చింది.

'లేదులేరా. ఆ కుర్రాడి నాన్న చాలా డీసెంట్మాన్. అర్థోపెడిక్ సర్జన్లేడూ కృష్ణమూర్తి. అతనే. అమికబుల్లీ సాల్వ్డ్. ఇప్పుడొచ్చింది వేరే పనిమీద" అన్నాడు లెనిన్.

"అర్జెంటా. టీ తాగే టైమేమైనా ఉందా?" అడిగాడు వెంకటేశ్వరరెడ్డి.

"టీ తెప్పించు. జరిగిందేమిటంటే..." అంటూ విపులంగా జరిగింది జరిగినట్టు చెప్పేశాడు లెనిన్.

"అయ్ నో దట్ యూస్లెస్ ఫెలో" అంటూ హాస్పటల్కి రింగ్చేశాడు వెంకటేశ్వరరెడ్డి.

సీఎమ్వోలైన్లోకి రాగానే, "ఆఁ నేను ... త్రీ టౌన్ సీయై డాక్టర్. ఇంతకుముందు హెడింజరీ కేసొచ్చిందే.. దాని గురించే.. అఁ అఁ యస్. సేమ్ కేస్" అంటూ మావేపుచూసి, "ఏమిటి వాడిపేరు?" అడిగాడు. "యాఁ.. యాఁ.. సుదర్శనం. వాడు హీ ఈజెనోన్ ఆల్కహాలిక్. ఇప్పటికో ఇరవైసార్లు తాగి కిందపడి దెబ్బలు తగిలించుకున్నాడు. ఓసారి ఆర్టీసీ బస్ కింద కూడా పడ్డాడు. నోనో.. నో.. ఎమ్మెల్సీ అవసరం లేదు. క్రిటికల్గా ఉందా... దెన్ ఓకే. యాఁ... హీయీజె క్లోజ్ ఫ్రెండాఫ్ మైన్. థ్యాంక్యూ" అని ఫోన్ పెట్టేసి,

"వాడు చావడు. ఇలాంటి నా కొడుకులు భార్యాబిడ్డల్ని చంపుతారు గానీ, వాళ్ళు చస్తారా? హీ యీజాల్రైట్. మీరందరూ ఆమెతో డైవోర్సెందుకు ఆప్లై చేయించకూడదు. నేనూ హెల్ప్ చేస్తా. వాడి యూజ్లెస్ క్యారెక్టర్ని సబ్స్టాన్షియేట్ చేయడానికి" అన్నాడు వెంకటేశ్వరరెడ్డి.

"నేనెప్పట్నుంచో ఆమెతో అదే అంటున్నాను. ఇక నౌ ఇట్స్ హై టైం. నేనే దగ్గరుండి అడ్వకేట్ దగ్గరకి తీసుకెళ్తా. ఎలాగూ మన నిజాంగాడుండనే ఉన్నాడు గదా" అన్నాడు లెనిన్.

వెంకటేశ్వరరెడ్డికి థ్యాంక్స్ చెప్పి మా ప్రభాత్ నాట్యమండలి గదికెళ్ళాం. వెళ్ళేటప్పటికి గదిలో దృశ్యం పొద్దునలాగే ఉంది. సుశీల కొడుకు ఇడ్లీ తింటున్నాడు.

లోపలికెళ్ళగానే వాళ్ళ ముగ్గురి కళ్ళలో విపరీతమైన కుతూహలాందోళనలు.

"వాడు చావలేదు సుశీలా. నువ్వేమీ భయపడకు. వాడిని హాస్పిటల్లో చేర్చి వచ్చాం. పోలీస్ కేసు కూడా కాదు. తప్ప తాగి పడిపోయాడని రాయించాం. ఇక ఇప్పుడు చేయాల్సింది నువ్వు మొట్టమొదట జమున్ని పిల్చికెళ్ళి ఇంట్లో నీ వస్తువులేమేం ఉన్నాయో తెచ్చేసుకో. వాడితో విడాకులకు అప్లైయ్ చేసేయ్. విడాకులు మంజూరై నీకో దారి దొరికేవరకూ జమున ఇంట్లో బాబుతో ఉండొచ్చు నీవు. పద లెయ్" అన్నాడు లెనిన్. సుశీల కూడా అదే నిర్ణయంతోటే ఉన్నట్టు అలాగే అని తలూపింది.

"హమ్మయ్య" అంది జమున.

"అయితే ఈ రోజుకి రిహార్సల్స్ లేనట్టేనా." చేతులు రెండూ ఎత్తేసి నవ్వుతూ అన్నాడు సూర్యారావు.

జమున, సుశీల వెళ్ళింతర్వాత లెనిన్ అన్నాడు. "నిజాముద్దీన్ నా క్లాస్‌మేట్. అడ్వకేట్. మీక్కూడా తెలుసు. సుశీలని ఈ రోజు సాయంకాలమే తీసుకెళ్లి డైవోర్సుకి అప్లై చేయించేస్తా.

"నిజమే. ఆ కిరాతకుడితో ఇన్ని రోజులు ఎలా, ఎందుకు వేగిందో సుశీల అర్థం కాదు. తన కాళ్లమీద తాను నిలదొక్కుకునే అవకాశం మనందరం కలిసి ఎలాగో కల్పిద్దాం." ధృఢంగా అన్నాడు సూర్యారావు.

ఏమో అవుతోంది. మా అందరి జీవితాల్లోనూ అనుకోని మార్పులు జరుగుతున్నాయి. నేనుతాగుడు మానేయడం, సుశీలకి విముక్తి. మా నాటక సంస్థ సభ్యుల వైయక్తిక కథలన్నీ నాటకీయంగా మారుతున్నాయి.

అదే అన్నా లెనిన్, సూర్యారావుల్తోటి.

"ఇంకో నాటకీయ పరిణామం జరగాల్సుంది. జమున, మాస్టార్ల పెళ్ళి." లెనిన్ హాయిగా నవ్వుతూ అన్నాడు.

"మీరు ఇల్లు కట్టుకోవడం కూడానూ" అంటూ సూర్యారావు సిగరెట్ వెలిగించుకుని చేతి సంచిలోంచి కొన్ని కాగితాలు తీసి, "మీరా రోజున బెకెట్ వెయిటింగ్ ఫర్ గోడోఁ నాటకమిచ్చిన తర్వాత, దాన్ని చదివంతర్వాత నాకేమైందో నాకు తెలీదు. ఇదిగో ఈ నాటిక రాశాను. ప్రయోగాత్మకమో కాదో నాకు తెలీదు. వట్టి రఫ్ స్కెచ్ అనుకోండి ప్రస్తుతానికి. ఇంకా డైలాగ్ బాగా డెవలప్ చేయాల్సుంది. కొన్నిచాలా చాలా బరువైన పదాలుపడ్డాయి. బాగా తేలిక చేయాలి. వినండి చదువుతా" అని చదవడం మొదలుపెట్టాడు.

"టైటిల్, 'ప్రవల్లిక'.

యవనిక తొలగి, రంగస్థలమంతా చీకటి. చిన్నగా, చినచిన్నగా ఓమూలనుంచీ కాంతి, బంగారు కాంతి.చీలికైనట్టు చిట్లిన కాంతిబద్దలా... కనీ కనబడక మసకగా రంగం ఎడమ నుంచి కుడికి చిన్నగా పొగలావ్యాపించి... (సాంబ్రాణితో చేయొచ్చు) కాంతికి విలువ తెస్తూ తెస్తూ.. ఎడమనుంచి నలుగురు ఓ శవాన్ని మోసుకెళ్తారు.

రంగం కుడి వేపుకి (నేపథ్యాన నాదనామక్రియ రాగం) శవవాహకుల కదలికా, ముందునడుస్తున్న వ్యక్తి (పొగలొచ్చే కుండ మోస్తూ స్లోమోషన్లో) ఉండాలి.

అంతా కదలి వెళ్ళిన తర్వాత మళ్ళీ అంతా చీకటి. (నేపథ్యాన భూపాలరాగం).

పైనించి గుండ్రటి కాంతి మూలకి ఫోకస్.

చిన్ని పాపడు. నడకలొచ్చీ రాని పాపడు. ఆ మూల్నించి ఎడమ మూలకి (లైట్ ఫోకస్ ఫాలో అవుతూండాలి. వాడిమీద మాత్రమే).

వాడెళ్లింతర్వాత చీకటి.. మళ్ళీ నేపథ్య సంగీతంమార్తుంది (మోహన రాగం)

లైట్ ఫోకస్ అలాగే గుండ్రటి ఫోకస్ ఎడమ నుంచి... ఎదిగిన ఆరేళ్ళ పాపడు ఎడమ నుంచి ఓ చక్రాన్ని దొర్లిస్తూ కుడి మూలకివెళ్తాడు వట్టిచెడ్డీతో.

ఒక్కసారిగా నిశ్శబ్దం. చీకటి.

ఆ చీకటిలోంచి తెల్లపావురమొకటి రెక్కల్విదుల్చుకుంటూ రంగస్థలం నుంచి ప్రేక్షకుల మధ్య కెగిరిపోయింది.

ఆ పావురమ్మీద ప్రేక్షకులు దృష్టి సాగిస్తున్న క్షణంలో ఒక్కసారి చీకటిరంగం మధ్యన తీక్ష్ణమైన కాంతివలయం. ఆ కాంతి వలయంలో డొక్కలెండి, బక్కచిక్కి, చింపిరి జుట్టుతో, పెరిగిన గడ్డంతో, చిన్నపంచె, మోకాళ్ళ మీదకి మాత్రం కట్టుకుని ఓ ముదుసలి (ఇక్కడ ఏకో మైక్రోఫోన్ ప్రిఫర్డ్.) సంభాషణ : "హ్హా, హ్హా హ్హా హ్హా..ఓం ... హ్హా హ్హా హ్హా.. పి...పిచ్చి... అంతా...పిచ్చి.... అంతా ఇంతేని తెలీని దౌర్భాగ్య లోకానికున్న పిచ్చి చూడండ్రా నాయన్లారా! చూడండే అమ్మల్లారా. ఎవరే గమ్యానికి? ఏ పడవే తీరానికి. భూమధ్య రేఖనీసిన వాడెవ్వడు? నా మధ్య జీవితాన్ని రచించిన వాడెవ్వడ్రా. అంతా.. అంతా మిధ్య... బాబుల్లారా! అమ్మల్లారా.. అంతా అహ్హహ్హహ్హ.. ఓ... ఒహ్హోహ్హోహ్హా..."

(రంగం చీకటి.. నేపథ్యంతో... కళావతి రాగం మొదలైంతర్వాత... స్టేజంతా వెలుగు...)

(ఓ అందమైన యువతి తెల్లటి వస్త్రాల్లో అట్నుంచిటూ, ఇట్నుంచటూ. అటూ ఇటూ, ఇటూ అటూ... తల విరబోసుకు... అలా అలా రంగస్థలమంతా గింగిర్లుగా తిరిగీ తిరిగీ).

లైట్స్ ఆఫ్... చీకటి.

లైట్స్ ఫోకస్ ఆన్.. గుండ్రటి ఫోకస్. ఆ యువతి రంగం మధ్య నిలబడి తలవెనక్కి వాల్చిచేతుల్రెండూ చాచి, "నా ప్రియ జీవితమా! నా కామిత నేస్తమా! ఆ చిగురుల, లేలేత చిగురున చివరల వేలాడుతూన్న తుషార బిందువుల దూరి మాయమైన ముయూఖాలు నా మర్సత్రోజులై, రంగుల కాంతుల ఇంద్రధనుస్సులై, చిట్లి.. ఓహ్... నా ప్రియా... సఖా...

నా వేలి చివర్ల చిట్లిన చివురులు.

నా ఒళ్ళంతా వసంతాలై.

నీ తన్మయత్వాన తల్లడిల్లిన వల్లికా వాటికనై.

మ్..జీవితమెంత మధురం!"

రంగం : చీకటి.

మళ్ళీ ఫోకస్ లైట్.

నిశ్శ....బ్ద....ం.

కాళ్ళు లేని ఓ కునిష్ఠి చక్రాల చెక్కమీద కూచుని చేతుల్తో నేలన్తోస్తూ తాను ముందుకు వెళ్తూ... అలా అలా... స్టేజీ ఆమూలకి..

వెనకాల నేపథ్యంతో, "అబ్బా! వదలండి. పిల్లలంతా మేల్కొన్నారు. అరె చెప్తే మీక్కాదూ."

"సేయ్, నిన్నిచ్చినాఽరూపాయల్తియ్యే. నాగ్గావాలిప్పుడు." లారీల్వెళ్తున్న చప్పుడు.

రేడియో పాట ట్యూన్చేస్తున్న చప్పుడు

అరుపులు, బూతు మాటలూ, తిట్లూ...

కుక్కల్మొరుగుడు.

రంగమంతా వెలుగే.

నేపథ్యం నిశ్శబ్దం.

లాల్చీ, పైజామాతో ఓ వ్యక్తి.. పంచె, చొక్కాతో ఇంకో ముసలి వ్యక్తి.

లాల్చీ, పైజామాతో ఓ వ్యక్తి సిగిరెట్ వెలిగించి పీలుస్తూ చూస్తూ భుజాలెగరేసి, విషాదంగానవ్వి -

ఒక్కసారి "ఓ" అని గట్టిగా అరిచి, మళ్ళీ కళ్ళు విశాలం చేసి నోటికి వేలడ్డం పెట్టుకుని, "ష్... ష్.. అని.

సంభాషణ : "నిశ్శబ్దం. ఎవరూ మాట్లాడొద్దు. నిజం మనం మాట్లాడ్డానికి చోట్లేదు. ఇది మనం మాట్లాడే.చోటుకాదు. ఈ చోటు చిన్ని ఓటుది మాత్రమే ఖద్దర్కోటుది మాత్రం.. అవున్నిజం..."

'ష్...ష్"

రాకండి మేధావుల్లారా! నా వీధుల్లోకి. వీధుల్లోకి మేధోవీధుల్లోకి అడుగులేసి తొడుగుల్తీసి.

నాగరికతల్నొలిచే వేగిరపాటున నను మరచి కరచి పట్టుకున్న సైద్ధాంతిక రాద్ధాంతాల్లో నా వైదగ్ధిని కాల్చికాల్చి, వేల్చి వేల్చి, వేలి... చి...చి. చివర్న, కవర్లల్లో టెండర్లై, వండర్లై, బ్లండర్లై, సిండర్లై, మాడి మాడి, మసులై, నుసులై, బొగ్గుల సిగ్గులై, అగ్గిబొగ్గుల, నుగ్గులై, అవినీతి అందాల ముగ్గులై, నాగరికల్మొదిమి చిదిమి, వగ్గులై.

సంభాషణ : "ఏయ్" అని ఆ ముసలి వ్యక్తి.

బాగుంది! బాంది! బాగుంది! బాంది! యేంది? బాగుంది! ఏసుంది? బాసుంది? బాసు...! ఏసు! మేకుల్దిగేసుకున్న ఇంటేను..! ఇంటేసేంది? క్రాసేను! క్రాసేనంటే, ఏసంటే, అంటే..? ఎంకటేసన్మాట! పంగనామాలెంకటేసు...బోడిగుండెంకటేసు..

వాడీడొకటేనా? భక్తులు కొడుకుల్తంతారొరేయ్.. తన్ననీ... మన్ననీ...! ఏం మన్నన?

యువకుడు : కార్లైల్కామాతురత్నమీదో కవిత్రాస్తే ఎట్లాగుంటంది?

ముసలివాడు : గుంటది.. గుంటంటే? థూ఼ త్...యా...క్కూ఼...!

యువకుడు: కాలగమనం. మేథోగమనం.. ఒకటి నైమిత్తికం. ఇంకోటి వైయక్తికం. యేకం...? యే..కం.? ఏకం!... మమేకం..! నేనేదనుకునే సిద్ధాంతాలన్నీ ఒకటే.. మదోన్నత చిత్త భావనా విచిత్ర గతుల్చరించి చరిత భావనల్విరిచి.. చర్చించి... చరిత్రల్చేసి గతాలనుమ్మక్తం చేసి.. పునరుక్తం చేసి... చర్వితచర్వణం.. మరణం.. అక్కడ్తో అది చచ్చిందా? పుచ్చిందా? అన్న పృచ్ఛ... పృచ్ఛ... ప్రశ్న!"

నిషిద్ధాక్షరి.. విషమయ సంకేతాక్షరి. అష్టావధానం.. అవధానం.. మోహనావ ధానం.. సమ్మోహనం.. మోహనం... మోహనమేహనం..

మళ్ళీ మళ్ళీ గబ్బు.. ఛీ఼ అలాంటి మాటలేలా?

అలా...఼ ఆ ఆ .. ఆఆ ... ఇ.. ఈ...

పునరుక్తి.. వ్యక్తి.. త్యక్తి... జీవన్ముక్తి అదే.. అదే అదీ జీవనశక్తి!

కుంటు... కుంటుకుంటుకుంటా.. నే దాటుకుంటూ.. దాటి.. దాట్రానను కుంటూ.

ఎన్ని బ్రిడ్జిలు? బ్రిడ్జి...? పేకాట బ్రిడ్జి. పేకాటల జోకర్లు... మూడాకుల.. నాల్గేసుల మూడ్రాణుల... పేకాటల...సాకేత సార్వభౌముల ఒకే బాణాల.. బ్రిడ్జి.

బాణాల, నార చీరల రాణుల తోకల రాజుల రాణుల తోకల్లేని రాణుల రామాయణాలై పురాణాల మరణాలకు, నువ్విచ్చిన ఆత్మహత్యల విషాలై... ఆ విషాల కషాయం చేదునిజాల్ని చదివితే నాగరికుడు రాక్షసుడై... 'తంతా!' మతం.. మత్తు.. నువ్వు చిత్తు.

ఇదో రకం కసరత్తు!

చూశావా?

కసరత్తు చేసి, చేసి నాగరికతల్కండలు బలిశాయి. బలిసీ బలిసీ.. బలిసిన్నాగరికత.. ఒదిగుండలేక పొదిలి పొదిలి..."

పంచెవ్యక్తి : 'చినుక్కోసం.. చినిగిపోయినాను. ఒరేయ్ దేవుడూ.. ఒక్కట్రా. ఒక్కటంటే ఒకట్రా.. చినుకు.. దరిద్రంరా.. నాపెండ్లాం రోగంరా... నా కూతురి సంసారంరా... నాయమ్మ రోగంరా.. బస్సు రానీరా.. నైట్రంఫాసూ.. పొగల్మందూ కొనుక్కుంటారా... రేయ్ ఎమ్మెల్లే నీకోటేస్తి గద్రా.. నీ కోసం ఏసిన వోటు నా నోటి కూటికోసం పనికొచ్చే వోటై పండించుకొనేదానిక్రా.. రేయ్!

నా తమ్ముణ్పెడ్లాం కడుపెత్తెచ్చుకోనుండాద్రా అది కనే కూను.. తినే తిండి కోసంరా!"

"ఆ఼..."

లాల్చీ వ్యక్తి : పంచె వ్యక్తితో సంబంధం లేకుండా...

"ఇదండీ లోకం.."

పంచె వ్యక్తి : బస్సెక్కడా?

ఈరోజూ రాదా!

తెర

అయాసంతో ఆగాడు సూర్యారావు.

అంతా విన్న తర్వాత లెనిన్, నేనూ ఇద్దరం దీర్ఘంగా నిట్టూర్చాం. నాకు తెలియని భయం నిండింది లోపల, అతని రాత విని. "మన ప్రేక్షకులు అంతగా ఎదగలేదు మాస్టారూ, ఎదగలేరు కూడానేమో. ప్రయోగాత్మక నాటకం దశ ఎలా ఉందో మనకు తెలుసు. అడ్డానికి వీలుకాక పోవచ్చుగానీ, మనకు... మీలో ఓ అద్భుతమైన సర్రియలిస్టిక్ రచయిత ఉన్నాడని తెలిసిపోయింది. థాంక్స్ ఫర్ బ్రింగింగౌట్ దట్‌పార్టాఫ్ యూ.." అన్నాడు లెనిన్.

ఆ రోజుకి ఇక సెలవనుకున్నాం. లెనిన్ సాయంకాలం సుశీలని తానే తీసుకెళ్ళి నిజాముద్దీన్తోటి డైవోర్సుకి అప్లై చేయిస్తానని నన్నింటిదగ్గర డ్రాప్చేసి వెళ్ళిపోయాడు.

✦ ✦ ✦

సుశీలకో జీవిక అవసరం కాబట్టి తాను పూచీ ఉండి బ్యాంకు నుంచి లోను మంజూరు చేయించి తనతో ఓ చిన్న ఫ్యాన్సీ స్టోరు పెట్టించాడు లెనిన్.

ఈ నేపథ్యంలో మా 'శిథిలనగరం' రిహార్సల్స్ మూలకు పడిపోయింది. పోటీల్లో పాల్గొనే ప్రసక్తే లేకుండా పోయింది. 'కామెడీ నైట్' మాత్రం కండక్ట్ చేసి ఖాదర్‌సాబ్ కుటుంబానికో పన్నెండు వేల ఇవ్వగలిగాం. మధ్యలో హాస్పిటల్నించి కోలుకుని వచ్చిన సుదర్శనం గొడవ చేయడం... వెంకటేశ్వరరెడ్డి తీసుకెళ్ళి బుద్ధి చెప్పడం.. ఓ రెండుసార్లు జరిగింది. సుశీలకి సులభంగానే విడాకులు దొరికాయి.

రోజులు ఎవరితోటి, దేంతోటి ప్రమేయం లేకుండా దొర్లిపోతున్నాయి.

ఓ రోజాదివారం ఉదయాన్నే లెనిన్ వచ్చాడు. "పద సూర్యారావింట్లో అర్జెంటుగా మీటింగొటుంది. మన్దే పూర్తి పర్సనల్ పదపద" అని తొందరపెట్టి పిల్చుకెళ్ళాడు.

సూర్యారావింటికెళ్ళేసరికి జమునా, సూర్యారావు ఇద్దరూ ఏదో దీర్ఘంగా చర్చించుకుంటున్నారు. మేమెళ్ళేసరికి అర్థంతరంగా ఆపేశారు చర్చను.

కూచోగానే, "మేస్టారుకి పెళ్ళి చేద్దామనుకుంటున్నామండీ" అంది జమున నాతో. ఆ గొంతుకలో ఏదే అపశ్రుతి. అనుమానంగా లెనిన్ వేపూ, సూర్యారావు వేపు మార్చి మార్చిచూశాను.

సూర్యారావు కిటికీలోంచి బయట శూన్యంగా ఉన్న ఆకాశంలోకి చూస్తున్నాడు.

"అవునండీ సుశీలకీ, మాస్టారుకీ పెళ్ళి చేద్దామని".

"అదేమిటి.. అలా అంటున్నావ్ జమునా? నువ్వూ, మాస్టారూ అని అనుకున్నదేగా.. ఇప్పుడేమిటిలా?" అడిగాను.

"నేనే అలా నిర్ణయించుకున్నాను.. ఇప్పుడు సుశీలకే నా అవసరం ఎక్కువ. జమున గురించి బాధలేదని కాదు. అర్థం చేసుకోండి దయచేసి" సూర్యారావన్నాడు.

"జమునా" అన్నాడు లెనిన్ ఆవేదనగా.

"నిజమే లెనిన్. మేస్టారే ఓ రోజునన్నారు ఈ కళాకారులకు రంగస్థలమే అసలు జీవితం. సాధారణ జీవితం రంగులు వేసే గదిలాంటిదే అంటూ, నన్ను 'ఓవరాక్షన్ చేయకు' అన్నారు. అప్పుడ్నేనేమన్నానో గుర్తుంది కదూ, అసలు రంగం మీద ఎలాగూ ఓవర్యాక్షన్ చేయనివ్వరు. కనీసంగ్రీన్రూమ్‌లోనైనా చేయనివ్వండి నన్ను అన్నాను. ఇదిగో అందుకే స్టేజిమీద భార్య పాత్రని సుశీలకిచ్చేసి, నన్ను ఆ వెనకాల రంగుల గదికే పరిమితం చేశారు మేస్టారు" అని ఫక్కున నవ్వింది.

ఆమె కనురెప్పకు వేలాడ్తోన్న కన్నీటి బిందువు మెరుపు అక్కడ ఎవ్వరి కళ్ళనూ తప్పించుకోలేకపోయింది. ★

*('ఇండియా టుడే' వార్షిక సాహిత్య సంచిక - 2000)*